

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 216 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 02, జూలై 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



# అభివృద్ధికి ఆప్తులెవరు

- ఆర్థిక లాభాలను అనుభవిస్తున్నది ఎవరు
- ఆర్థికంగా బలపడుతున్నది ముమ్మాటికి రాజకీయ నాయకులే
- ఆర్థిక లావాదేవీలతో పేదలకు సంబంధం ఏమీ లేదు !
- చిరు వ్యాపారస్తులకు చేనేత కార్మికులకు కాయా కష్టమే అభివృద్ధి
- కార్మికుల జీతాల్లో వాటాలు కాజేస్తున్న దుర్మార్గులు లేకపోలేదు
- దేశ ఆర్థిక దోపిడీతో బాగుపడుతున్నదేవరు
- వ్యాపారాల పేర్ల మీద వేలకోట్ల రూపాయల బ్యాంకుల రుణాలు పొందుతున్నారు
- రైతులకు లోన్లు ఇవ్వరు సామాన్యులకు సబ్సిడీలు సకాలంలో రావు
- నోట్ల మార్పిడి దేశంలో లక్షల కోట్ల వ్యాపారాలు చేసింది : డాక్టర్ బరిగెల శివ



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

దేశంలో ఎక్కడ చూసిన అభివృద్ధి అంతా ఒకేవైపు నడుస్తుందని ఆర్థిక బాధలు మరోవైపు నడుస్తుండడం చూస్తుంటే సామాన్యులు అభివృద్ధికి ఆప్తులు ఎలా అవుతారంటూ డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా పరిగణించారు.దేశంలో పెరిగిపోతున్న నిత్యవసరాల ధరలు సామాన్యుల అభివృద్ధిని తీవ్రంగా అడ్డుకుంటు న్నాయన్నారు. మనుషుల విశ్వరూపం పైసల కాడ కనిపిస్తుంది అనేది వాస్తవమన్నారు. గ్రౌండ్ లెవెల్ అభివృద్ధి గాడిన పడేది ఎప్పుడో తెలియదు గాని ప్రభుత్వాల ఖజానా ఖాళీ అవుతుండడానికి కారకులు ఎవరో అంతుచిక్కడం లేదన్నారు.అభివృద్ధికి ఆమడ దూరాన అణచివేయబడ్డ వర్గాలు జీవిస్తుండడం భాదేస్తుందన్నారు. పైసా స్వరూపం మనుషుల జీవితాలలో మార్పులను తీసుకువస్తుండమే కాకుండా మానవ సంబంధాలను మానవ విలువలను క్షేత్రస్థాయిలో శాసిస్తుందన్నారు. ఒకప్పుడు మనుషులు ఎంతో నిజాయితీగా జీవించేవారని డబ్బుతో పని లేకుండా కష్టపడి సంపాదించిన సొమ్ములో పక్కోలకు, బంధువులకు, ఆప్తులకు, సహాయం చేసే మనస్తత్వం కలిగి జీవించే వారన్నారు.నేటి దినాల్లో డబ్బుంటేనే

- మిగతా 2లో..

## భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు

ఎన్.రాంచందర్ రావు

3




## సీఎం కాన్వాయ్ వాహనంలో ప్రయాణించిన కామన్ మ్యాన్

కొవ్వూరు పర్యటనలో డప్పు కళాకారుడు,చర్మకారుడి సాధకబాధకాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

2



## ఎస్సై రాణా ప్రతాప్ భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య.!

**ఖమ్మం జిల్లా (జై భీమ్ న్యూస్)**

రఘునాథపాలెం మండలానికి చెందిన జిఆర్పి ఖమ్మం ఎస్సై రాణా ప్రతాప్ భార్య రాజేశ్వరి ఆత్మహత్య! ఎస్సైతో సహా కుటుంబ సభ్యులు కలిసి దాడి చేసి చంపారని ఆరోపిస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలింపు. మొదటి నుంచి రాణా ప్రతాప్ ది దురుసు ప్రవర్తన అంటున్న స్థానికులు.. మృతురాలి బంధువులు! వృత్తి పరంగా కూడా వివాదస్పదుడిగా అతనికి పేరుంది! గతంలో ఖమ్మం లో ట్రైని ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో ఓ వ్యక్తిపై గన్ను పెట్టి బెదిరించి,దాడి చేసినట్లు రాణా ప్రతాప్ పై ఆరోపణలున్నాయి.





## బాధలు తీర్చే దైవం బల్కంపేట ఎల్లమ్మ

అమ్మవారికి కళ్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించడం నా అదృష్టం

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడి

వివరాలు 6లో

## నిన్న హెూసబాలే నేడు ధన్కడ్,రాజ్యాంగ పీఠిక పై వివాదాన్ని రాజేస్తున్న ఆరెస్సెస్-బీజేపీ

6



## అత్తింటి వేధింపులే.. ఐఏఎస్‌ని చేశాయి!

7



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# అభివృద్ధికి ఆప్తులెవరు

మొదటి పేజీ తరువాయి

చాలు మానవ సంబంధాలతో మనుషుల విలువలతో ఏమి పని లేదనే విధంగా సమాజం నడుస్తుండడం ఒకరకంగా చెప్పాలంటే సామాన్యుల అభివృద్ధిని పూర్తిగా అడ్డుకుంటుందన్నారు.ధనిక వర్గాలన్నీ అభివృద్ధిని లెక్కలేసుకొని పంచుకుంటున్నాయన్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో బరితెగించి నోళ్ళదే అభివృద్ధి అంటూ అలాంటి వాల్లు సామాన్యుల అభివృద్ధిని లాగేసుకుంటున్నారని తీవ్రంగా హెచ్చరించారు.ఏ ప్రభుత్వ కార్యాల యాల్లో ఎక్కడ చూసిన డబ్బులున్నోళ్లకు, అధికారం ఉన్నోళ్ళకే మాత్రమే పనులవుతున్నాయి తప్ప సామాన్యులకు ఏ కోశానా పనులు కావడం లేదన్నారు.అభివృద్ధి సమపాల్లుగా జరగాల్సిన రాజకీయ ప్రస్థానంలో కూడా దోచుకున్నానిదే రాజ్యమౌతూ పార్టీలు మారినోడే అభివృద్ధి చెందుతున్నాడు తప్ప సామాన్యుల అభివృద్ధి ఎక్కడ కానరావడం లేదన్నారు.ప్రభుత్వ నిధులను దుర్వినియోగపరుస్తూ దోచుకోవడానికి మరిగినోళ్లు అభివృద్ధిలో దూసుకుపోతున్నారన్నారు.పేదల అభివృద్ధి అంతంత మాత్రమే అంటూ కాయకష్టం చేసుకుంటే తప్ప కూడు దొరకని స్థితిలో ఉంటున్నారని బాధ వ్యక్తంచేశారు.విచిత్రమైన వ్యాపారాలు వింత వ్యాపారాలు పెరిగిపోతూ కార్మికులకు పనులు దొరుకుడు కష్టంగా మారిపోతుందన్నారు.చివరకు కొన్నిచోట్ల కార్మికుల సొమ్ములో ఆర్థిక వాటాలను కాజేసే నీచమైన స్థితికి అధికారుల అభివృద్ధి కొనసాగుతుందన్నారు. నిజాయితీపరులు రాజకీయంలో అభివృద్ధి చెందలేక వెనుకబాటుతనాన్ని అంటిపెట్టుకొని జీవిస్తుంటే అక్రమ సంపాదకులు అవినీతిపరులు వ్యాపారాల్లో మునిగితేలుతూ అభివృద్ధిని శాసిస్తూ పేదల అభివృద్ధికి అడ్డపడుతున్నారన్నారు.ప్రభుత్వాలు కల్పిస్తున్న సంక్షేమ పథకాలపై ఆధారపడి అభివృద్ధి చెందాలని సామాన్య ప్రజలు ఎంతగానో ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. అధికార వ్యవస్థలు వాటాల వారీగా ఆర్థిక స్థితిగతులపై దాడులు చేస్తుంటే సామాన్యుల అభివృద్ధి సాధ్యమేనా అంటూ నిజమైన అభివృద్ధికి ఆప్తులు సామాన్యులు ఎప్పుడు కాలేరన్నారు.అభివృద్ధి అంటేనే ధనికులు అభివృద్ధి అంటేనే నాయకులు అభివృద్ధి అంటేనే వ్యాపారస్తులు అభివృద్ధి అంటేనే అధికారులు అభివృద్ధి అంటేనే ప్రైవేట్ రంగ సంస్థలు అభివృద్ధి అంటేనే ప్రైవేట్ వ్యాపారస్తులు అభివృద్ధి అంటేనే అక్రమ దోపిడీదారులు అభివృద్ధి అంటేనే సామాన్య ప్రజలను దోచుకునే వాళ్లంటూ ఈ విధంగా వందల రకాలుగా పేద ప్రజలను అభివృద్ధికి ఆప్తులు కాకుండా అడ్డపడుతున్నది నేటి సమాజంలో కండ్లకొద్దినట్టు కనిపిస్తుందన్నారు.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేద ప్రజలను అభివృద్ధి చేయాలని తీవ్రమైన పట్టుదలతో కృషి చేస్తుండడం అది కాస్త కొన్నిచోట్లకే పరిమితం అవుతుండడం పేద ప్రజల అభివృద్ధిని నియంత్రిస్తుందన్నారు.ఆంధ్రప్రదేశ్లో అభివృద్ధి అనే మాట మర్చిపోయి సంవత్సరం అవుతుందన్నారు.అభివృద్ధి రూపంలో రావాల్సిన సూపర్ సిక్స్ పథకాలను అడిగితే చాలు దాడులు చేసి కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారన్నారు.సంక్షేమ పథకాలు అంటేనే పేదవాళ్ల కోసమని అలాంటి పేదవాళ్ల కోసం కేటాయిస్తున్న సంక్షేమ పథకాల్లో అర్హులంతా ఎక్కువగా బడుగు బలహీన వర్గాలే ఉంటున్నందున కావాలనే అభివృద్ధికి దూరపరుస్తూ వెనక్కి నెట్టేస్తున్నారన్నారు.తెలుగు రాష్ట్రాల్లో శంకుస్థాపనల పేర్ల మీద అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రభుత్వ నిధులతో పలు విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న రాజకీయ నాయకులు వాళ్లు చేపడుతున్న అభివృద్ధి పనులతో ఆయా కాలనీలలో ప్రాంతాల్లో పట్టణాలలో గ్రామాలలో ఎన్ని కుటుంబాలు అభివృద్ధి చెందుతున్నాయో ఎందుకు అంచనా వేయలేకపోయారన్నారు.అభివృద్ధి పనులతో సమాజాన్ని అభివృద్ధి పరుస్తుండడం గొప్పతనంగా భావించాల్సి వస్తున్నప్పటికీ ఆయా ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలు అభివృద్ధికి ఆప్తులు కాకుండా పోతున్నారని ఒకింత బాధగా ఉందన్నారు.అభివృద్ధి పనులతో పాటు సామాన్య ప్రజల అభివృద్ధిని కూడా అదే స్థాయిలో కొనసాగిస్తే ప్రభుత్వాల పేర్లు పేద ప్రజలు తలుచుకునే ఆస్కారం ఉంటుందన్నారు.తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధి అనే పదం కాంట్రాక్టు పనులకు వ్యవస్థల దోపిడీకి మాత్రమే ఉపయోగిస్తున్నారు తప్ప సంక్షేమ పథకాల అమలులో పేద ప్రజల అభివృద్ధిని పెంపొందించలేకపోతున్నారన్నారు.సమాజంలో ఎక్కడ చూసిన పేద కుటుంబాలు పెరిగిపోతుండడంతో అభివృద్ధి అనే మాటకు అర్థం లేకుండా పోతుంది అన్నారు.సమాజాభివృద్ధితో పాటు సంక్షేమ అభివృద్ధి జరిగినప్పుడే సామాన్య ప్రజలు అభివృద్ధికి చేరువవుతతూ ఆప్తులవుతారని ఆ దిశగా ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేసి పేద ప్రజలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాల అమలులో అధికణాన్యత పెంచాలని ప్రత్యేకించి కోరారు.

# చార్మినార్ జోన్‌లోనూ పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్..!

**జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి నేతృత్వంలో సీసీఎల్ఏను కలిసిన నాయకులు**



**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

అతి త్వరలోనే ప్రారంభం కానున్న పదోన్నతుల ప్రక్రియ చార్మినార్ జోన్‌లోనూ సీనియర్ అసిస్టెంట్ నుండి నాయబ్ తహసీల్దార్ వరకు పదోన్నతుల ప్రక్రియ అతి త్వరలోనే ప్రారంభం కానుందని రెవెన్యూ జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి తెలిపారు.కోర్టు కేసు కారణంగా కేవలం చార్మినార్ జోన్‌లోనే పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జోన్లల్లో సీనియర్ అసిస్టెంట్ నుండి డిప్యూటీ తహశీల్దార్ వరకు పదోన్నతులను రెవెన్యూ జేఏసీగా ఇప్పటికే ఇప్పించడం జరిగిందన్నారు. మంగళవారం రెవెన్యూ జేఏసీ ఛైర్మన్,డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో సీసీఎల్ఏ లోకేష్‌కుమార్‌ను డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు,రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, తదితరులు కలిసి పదోన్నతుల గురించి వివరించారు. అర్హులకు వెంటనే పదోన్నతులను ఇవ్వాలని కోరారు. చార్మినార్ జోన్‌లో కోర్టు కేసు కారణంగానే పదోన్నతుల ప్రక్రియ నిలిచిందన్నారు. కోర్టు కేసు పరిష్కారం కావడంతో ఆగిపోయిన సీనియర్ అసిస్టెంట్ నుండి నాయబ్ తహసీల్దార్ పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను చేపట్టి,వేగవంతం చేయాలని కోరారు.దీనిపై సీసీఎల్ఏ లోకేష్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. అతి త్వరలోనే పదోన్నతుల ప్రక్రియను చేపట్టి అర్హులందికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు

**ఎన్.రాంచందర్ రావు**

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

జనసంఘ్ నుంచి భారతీయ జనతా పార్టీ వరకు... అనేక దశల్లో కార్యకర్తల త్యాగాలు, నిరంతర శ్రమ ఫలితంగా బిజెపి దేశంలో అతిపెద్ద, బలమైన పార్టీగా ఎదిగింది. క్రమశిక్షణ, సిద్ధాంతం పట్ల నిబద్ధతతో ఈ స్థాయికి వచ్చాం. ఇప్పుడు మనందరి లక్ష్యం బిజెపిని తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడం. ఈ సందర్భంగా ఒక సంఘటన గుర్తు చేసుకోవాలి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలులో బిజెపి ఏర్పడే ముందు, జనసంఘ్ తరపున ఓ అభ్యర్థి పోటీ చేశారు. ఆయనకు దాదాపు వెయ్యి ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికలో కమ్యూనిస్టు పార్టీ గెలిచింది. అయినప్పటికీ, జనసంఘ్ అభ్యర్థి తరపున కార్యకర్తలు పార్టీ కార్యాలయం ముందు బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. అప్పట్లో జనసంఘ్ నాయకులని ఆ సంబరాలపై ప్రశ్నించగా "గత ఎన్నికల్లో 300 ఓట్లు వచ్చాయి, ఈసారి వెయ్యి వచ్చాయి. పార్టీ ఎదుగుతోంది. బలోపేతమవుతోంది. అందుకే ఈ ఆనందం అని సమాధానమిచ్చారు. అలాంటి స్థితి నుంచి ఈరోజు బిజెపి తెలంగాణలో 8 మంది లోక్‌సభ సభ్యులు,8 మంది ఎమ్మెల్యేలు, ఒక రాజ్యసభ సభ్యుడు,ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్న స్థాయికి ఎదగడం గర్వకారణం. అప్పట్లో బిజెపి అంటే చాలామందికి తెలియని పరిస్థితి. నేను యువమోర్చా కార్యకర్తగా ఉన్నప్పుడు నల్గొండ జిల్లాలో సభ్యత్వ నమోదు కోసం సైకిల్‌పై డబుల్స్ జర్నీ చేసి పార్టీ కోసం పనిచేశాను. విద్యార్థి పరిషత్‌లో ఉన్నప్పుడు హైదరాబాద్ నుంచి బస్సుల్లో కరీంనగర్, మెట్‌పల్లికి వెళ్లి సభ్యత్వ సేకరణ కోసం ప్రయాణించేవాళ్లం. ఈరోజు బిజెపి ఈ స్థాయికి వచ్చిందంటే,దానికి కార్యకర్తల త్యాగాలు,నాయకుల కృషి, శ్రమ కారణం. డీఎస్పీ రెడ్డి , చలపతి రావు, వి. రామారావు , బండారు దత్తాత్రేయ, విద్యాసాగర్ రావు, డాక్టర్ కె. లక్ష్మణ్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షులుగా పని చేశారు.బిజెపి పార్టీ ఎదుగుదలలో ఇంతమంది రాష్ట్ర అధ్యక్షుల,నాయకుల కృషి, శ్రమ ఉంది. గత 11 సంవత్సరాలుగా నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పరిపాలిస్తోంది. ఆయనతోపాటు అమిత్ షా, జేపీ నడ్డా, బీఎల్ సంతోష్ గారి ఆశీర్వాదం కూడా మనకు లభిస్తోంది. జాతీయ నాయకులతో పాటు, రాష్ట్రస్థాయిలో కిషన్ రెడ్డి, డా. కె. లక్ష్మణ్, బండి సంజయ్ వంటి నేతల సహకారంతో నాకు ఈ బాధ్యత లభించింది. 14 కోట్ల సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన బిజెపిలో తెలంగాణ రాష్ట్ర శాఖకు నేను అధ్యక్షుడిగా ఎన్నికవడాన్ని నేను గర్వంగా భావిస్తున్నాను.అయినప్పటికీ, నేను నా మనసులో పార్టీ కార్యకర్తగానే పనిచేస్తాను. బిజెపిలో కలెక్టివ్ లీడర్‌షిప్ ఉంటుంది. గతంలో నల్లగొండ జిల్లాలో మైసయ్య గౌడ్ అనే కార్యకర్తను నక్సలైట్లు హత్య చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కృష్ణవర్ధన్ రెడ్డి ,చంద్రారెడ్డి నక్సలైట్ల బుల్లెట్లకు బలయ్యారు. నేటి బిజెపి నాయకులు మనోహర్ రెడ్డి , కాసం వెంకటేశ్వర్లు ,దుగ్యాల ప్రదీప్ కుమార్,ధర్మారావు ,నేనూ అందరం కలిసి నక్సలైట్లతో పోరాడి ఏబీవీపీని గెలిపించుకున్నాం.ఉస్మానియా యూనివర్సిటీలో ఏబీవీపీని గొప్ప స్థాయిలో నిలబెట్టడం జరిగింది.

**బిజెపి అనేది క్యాడర్ బేస్డ్ పార్టీ,మాస్ బేస్డ్ పార్టీ, ఐడియాలజికల్ బేస్డ్ పార్టీ..**

తెలంగాణలో గోల్కొండ ఖిల్లాపై బిజెపి జెండా ఎగురవేయాలంటే ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి. బిజెపిలో కొత్త,పాత అనే తేడా ఉండదు.మన ఇంట్లో బాబు పుట్టినా,పాప పుట్టినా పుట్టినరోజునుంచే వారు కుటుంబసభ్యులవుతారు.అదే బిజెపిలోనూ వర్తిస్తుంది. నది ప్రవహించాలి.కొత్తనీరు రావాలి.కొత్తవాళ్లు,పాతవాళ్లు కలిసి బిజెపిని బలోపేతం చేయాలి. తెలంగాణ యువత రాజకీయాల్లోకి రావాలి. యువతలో ఉన్న చైతన్యాన్ని బిజెపి లోకి తేవాలి. యువకులు,మహిళలు బిజెపి లో చేరాలి. భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలి. రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకురావాలి.బిజెపి వైపు రాష్ట్ర ప్రజలు చూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయి. పంచాయత్ నుంచి పార్లమెంట్ వరకూ బిజెపి గెలవాలి. బీఆర్ఎస్ పార్టీ వాట్సాప్ యూనివర్సిటీతో,కాంగ్రెస్ పార్టీ ఫేక్ న్యూస్ యూనివర్సిటీతో ట్రోలింగ్ చేస్తోంది. ట్రోలింగ్ చేసేవారు చేసుకుంటారు.కానీ రాంచందర్ రావు అనే వ్యక్తి సౌమ్యుడు కాదు.14 సార్లు జైలుకు వెళ్లినవాడిని. సిద్ధాంతం కోసం పోరాడినవాడిని.విద్యార్థుల కోసం లాఠీచార్జ్ లు ఎదుర్కొన్నాను.పోలీసులు చేసిన లాఠీచార్జ్ లో నా చేయి విరిగింది. సిద్ధాంతం కోసం,కార్యకర్తల కోసం త్యాగం చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను.అగ్రెసివ్ అంటే సిద్ధాంతంపై నమ్మకంతో ముందుకు వెళ్లడం.

**కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తాం..**

నేను విద్యార్థి దశ నుంచే అనేక పోరాటాలు చేశాను.అడ్వకేట్ల కోసం,విద్యార్థుల కోసం పోరాడాను. ఇప్పుడు తెలంగాణ ప్రజల కోసం పోరాడతాను. మీరు "నేను సైతం" అనే భావనతో కలెక్టివ్ లీడర్‌షిప్‌లో నన్ను ఆదరించాలి.నా నిర్ణయాలు వ్యక్తిగతంగా ఉండవు.అందరి నిర్ణయాలు తీసుకుని నేను అమలు చేయబోతున్నాను. భారతీయ జనతా పార్టీకి తెలంగాణలో మంచి భవిష్యత్తు ఉంది. కొందరు సోషల్ మీడియాలో బిజెపి పై, నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు.దమ్ముంటే నన్ను ఎదిరించి పోరాడండి. పేరులేని పేపర్లతో సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం చేస్తే వారిపై క్రిమినల్ కేసులు వేసి జైలుకు పంపిస్తాం.లీగల్ యాక్షన్ ఉంటుంది. మనమంతా క్రమశిక్షణతో బిజెపిని ముందుకు తీసుకెళ్లాలి.బిజెపి సిద్ధాంతాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాలి.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగించాలి. జాతీయ,రాష్ట్ర నేతల మార్గదర్శనంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తాను.

# ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్ (జై భీమ్ న్యూస్)**

మంగళవారం కలెక్టరేట్లో విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ తో కలిసి కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఇఓ ఆమోదంతో గవర్నింగ్ బాడీ రిజోల్యూషన్ ప్రకారమే ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు వసూలు చేయాలన్నారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు,షూస్ లాంటివి అమ్మకాన్ని నిషేధించాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంతోపాటు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలని, బోగివిల్లా వంటి మొక్కలతో పాఠశాలల్లో ప్లాంటేషన్ చేయాలన్నారు. అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ప్రతిరోజు ఫుడ్ కమిటీ చే చెక్ చేయించాలన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తొలగించుటకు ఇదివరకు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమాన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఈ సంవత్సరం నుండి నిర్వహిస్తామన్నారు. మాదకద్రవ్యాలకు విద్యార్థులు సేవించకుండా నిఘా ఉంచడంతోపాటు ప్రతి పాఠశాలలో మాదకద్రవ్య వ్యతిరేక క్లబ్బులను ఏర్పాటుచేసి ప్రతివారం విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వాడకం వల్ల జరిగే అనర్థాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. యూనిసెఫ్ సహకారంతో నిర్వహిస్తున్న స్నేహ క్లబ్లను ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన ఎన్సీఈఆర్టీ పుస్తకాలను వినియోగించి విద్యార్థులకు బోధించాలన్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి అన్ని అమలయ్యేలా పర్యవేక్షిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఈఓ జ్ఞానేశ్వర్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు,తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కాన్వాయ్ వాహనంలో ప్రయాణించిన కామన్ మ్యాన్

**కొవ్వూరు పర్యటనలో డప్పు కళాకారుడు,చర్మకారుడి సాధకబాధకాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి (జై భీమ్ న్యూస్)**

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం మలకపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది.పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ కిరాణా దుకాణం వద్ద ఆగారు. దుకాణదారు వ్యాపారం ఎలా ఉందంటూ వాకబు చేశారు. కిరాణా దుకాణాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దు కోవచ్చో దుకాణ యజమానికి సూచనలిచ్చారు.అదే సమయంలో ఆ దుకాణం వద్ద వస్తువులు కొనుగోలు చేస్తున్న చర్మకారుడు పోశిబాబును ఆప్యాయంగా పలకరించారు. చర్మకార వృత్తిలో అవసరమైన ఉపకరణాలు ఎక్కడి నుంచి తెచ్చుకుంటావని ఆరా తీశారు. పోశిబాబు చెప్పిన అంశాలను సీఎం ఆసక్తిగా విన్నారు. గతంలో వ్యాపారాలు చేసుకునే వారిని బెదిరించే వారని ఇప్పుడు ఆ బెదిరింపులు తగ్గాయని సీఎంకు కిరాణా దుకాణదారు వివరించారు. అనంతర చెప్పులు కుట్టడంతో పాటు మేదరపని కూడా చేస్తానని పోశిబాబు సీఎం కు తెలిపారు.డప్పు కొట్టేవాళ్లకు ఇచ్చే పెన్షన్ అందుతోందా అంటూ పోశిబాబును సీఎం ఆరా తీశారు.గతంలో చంద్రబాబు ప్రభుత్వంలోనే వెయ్యి రూపాయల పెన్షన్ తీసుకున్నానని..ఇప్పుడు రూ. 4 వేలు తీసుకుంటున్నానని సీఎంకు చెప్పారు.మీ కుల వృత్తిని కూడా చూస్తానంటూ పోశిబాబును తన కారులో కూర్చొబెట్టుకున్న సీఎం ఆయన ఇంటికి తీసుకెళ్లారు.కారులోనే మార్గమధ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు- చర్మకారుడు పోశిబాబు మధ్య సుదీర్ఘ సంభాషణ చోటు చేసుకుంది. సుమారు రెండు కిలో మీటర్ల మేర పోశిబాబును తన కారులో వెంటపెట్టుకుని చర్మకారుని ఇంటికి చంద్రబాబు వెళ్లారు.కొవ్వూరు నియోజకవర్గంలోని ధర్మవరం నుంచి మలకపల్లి వరకూ తన కారులోనే పోశిబాబును ఎక్కించుకుని సీఎం ప్రయాణించారు. కారులో వెళ్తూ పోశిబాబుతో ముఖ్యమంత్రి వివిధ అంశాలపై మాట్లాడారు. పోశిబాబు నుంచి సాధక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. చర్మకారుడు పోశిబాబు కుటుంబ సభ్యుల వివరాలు,వాళ్లు ఏం చేస్తున్నారనే అంశంపై ఆరా తీశారు.ముఖ్యమంత్రి పక్కన కూర్చొనే అవకాశం తనకు దేవుడిచ్చిన వరమని పోశిబాబు సంతోషాన్ని వ్యక్తం చేశారు.అయితే తాను పేదల గురించి తెలుసుకోవడానికే వచ్చానని సీఎం స్పష్టం చేశారు.వైసీపీ ప్రభుత్వంలో తన లాంటి వాళ్లు చాలా ఇబ్బంది పడ్డారని.. రాష్ట్రం అడుగంటి పోయిందని పోశిబాబు ముఖ్యమంత్రితో అన్నారు. ప్రజలందరి జీవన ప్రమాణాలు మెరుగవ్వాలనేదే తన ప్రయత్నమని సీఎం చంద్రబాబు వివరించారు. అనంతరం డప్పు కళాకారుడిగా ఆయనకు రూ. 4 వేల రూపాయల పెన్షన్ ను అందించారు. 2018లో ఇల్లు ఇచ్చారు కానీ.. గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడం వల్ల తాను ఇంటిని కట్టుకోలేక పోయానని పోశిబాబు సీఎంకు ఫిర్యాదు చేశారు.కారు దిగి పోశిబాబు ఇంటికి వెళ్లి..ఆయన తయారు చేసిన డోలు, డప్పులు, చెప్పులు, మేదర వస్తువులను ముఖ్యమంత్రి పరిశీలించారు. పోశిబాబు ఇంటి గట్టుపై కూర్చొని ఆయనతో సుదీర్ఘంగా మాట్లాడిన చంద్రబాబు ఇంట్లోకి వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. పేదరికం నుంచి బయటపడాలంటే తానేం చేయాలని చంద్రబాబు ప్రశ్నించారు. తన ఇంటి నిర్మాణానికి సంబంధించిన బిల్లులు ఇప్పించాలని, చెప్పులు కుట్టే దుకాణం ఏర్పాటుకు ఆర్థిక సాయం కావాలని చర్మకారుడు పోశిబాబు సీఎం ను కోరారు. దీనిపై స్పందించిన సీఎం వెంటనే మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.100 రోజుల్లోగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ ను ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో పాటు అవసరమైతే తాను ఆర్థిక సాయం చేస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. పోశిబాబు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేసిన ముఖ్యమంత్రి ఆయనకు డబ్బులు చెల్లించారు. ముఖ్యమంత్రి స్వయంగా తమ ఇంటికి రావటం..అనుకోని వరాలివ్వటంతో చర్మకారుడు, డప్పుకళాకారుడైన పోశిబాబు కుటుంబం అమితానందాన్ని వ్యక్తం చేసింది.

# సం పా దకీయం

## పాశమైలారానికి ఎవరు బాధ్యులు ?

కంపెనీ సైరన్ మోగే సమయానికి అంతా ఉత్సాహంగా తాము రోజూ పనిచేస్తున్న ఫ్యాక్టరీలో చేరారు. పొద్దున్నే సద్దికట్టుకుని వచ్చిన వారు కొందరు...ఇక్కడే టిఫిన్ చేద్దామనుకున్న వారు మరికొందరు.. రోజూలాగు డ్యూటీలో చేరారు. ఇదే తమకు ఆఖరి రోజని..తమ వారిని ఇక చూడలేమని వారు అనుకోలేదు. అలాగే కుటుంబీకులు కూడా రోజులాగానే వీడ్కోలు పలికినా...సాయంత్రానికి మళ్లీ వస్తారన్న నమ్మకంతో ఉన్నారు. కనీసం కడసారి చూపుకైనా నోచుకోలేని దుస్థితిలో ఇప్పుడు ఉన్నారు. 45 కుటుంబాలు ఛిద్రమయ్యాయి. దీనికి ఎవరు బాధ్యులు. రక్షణ చర్యలు తీసుకోకుండా యథాలాపంగా నడిపిన కంపెనీదా... లేకపోతే, నిర్లక్ష్యం వహించిన అధికారులదా అన్నది తేలాలి. ఏ ప్రమాదం జరిగినా కంటితుడుపు చర్యలు తప్ప కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదు. పాశమైలారం కావచ్చు, ఇండస్ట్రియల్ పార్కుల్లోనే భద్రత డొల్ల అని తేలింది. సరైన భద్రతా ప్రమాణాలు లేకుండానే ఇలాంటి వందల కంపెనీలు నడుస్తున్నాయి. పేరుకే కార్మికశాఖ ఉంది. కార్మికుల గురించి వారు పెద్ద స్పందించరు. హైదరాబాద్ క్రాస్ రోడ్డులో ఉన్న అంజయ్య భవన్‌కు వెళితే ఎన్నో దీనగాథలు కనిపిస్తాయి. కార్మికశాఖ మంత్రి కావచ్చు...అసలు మంత్రులకే తమ విధులేమిటో తెలియదు. కేవలం మంత్రి పదవులే లక్ష్యంగా పెట్టుకుని రాజ్యమేలుతున్నారు. కార్మిక శాఖను చూస్తున్న మంత్రికి ఎన్ని కర్మాగారాలు ఉన్నాయి..వాటిని సక్రంగా మెయింటెయిన్ చేస్తున్నారా లేదా తెలుసుకునే అవకాశం రాలేదు. ఎందుకంటే ఆయన పదవి చేపట్టి నెలకూడా దాటి ఉండకపోవచ్చు. అలాగని గతంలో పనిచేసిన కార్మిక మంత్రులు ఎవ్వరూ కూడా ఈ ఛాలయకు రాలేదు. పదవి ఇచ్చిన రాహుల్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవడం, ఇతర రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడంతోనే ఆయనకు సరిపోయింది. నిజానికి ఏ మంత్రికీ తమ శాఖలో ఏముందో, ఏం జరుగుతందో తెలియదు. రాజకీయాలు తప్ప మరోటి వారికి తెలియదు. బిజెపి అధ్యక్షుడు ఎవరు..బిసియా, బ్రాహ్మణుడా అన్న చర్చ చేయడంలోనే మంత్రుల కాలం గడిచింది. చనిపోయినవారిలో ఇప్పుడు ఎందరు బిసిలు, ఎస్సీలు పోయారు, ఎంతమంది అగ్రకులాల వారు తప్పించుకున్నారో ఈ మంత్రులను అడిగి తెలుసుకోవాలి. ప్రాణానికి కులమతం లేదని తెలుసు కోవాలి. అందుకే ప్రమాదానికి గల కారణాలు వెతకాలి. కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి మరో దుర్ఘటన జరక్కుండా మంత్రి వివేక్ కార్మిక శాఖను అప్రమత్తం చేయాలి. సిగాచి లాంటి సంస్థలను జల్లెడ పట్టాలి. నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలు నడుస్తున్నాయా లేదా అన్నది పరిశీలించాతి. ఎందుకంటే సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఘటనలో మృతుల సంఖ్య 45కు చేరింది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భవనం, శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వెలికితీసిన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో 11 మంది పరిస్థితి పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఇలా ఎందుకు జరిగిందన్నది ప్రాథమిక విచారణ జరగాలి. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారంటే తీవ్రత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వారాయి. సమాచారం అందుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో అక్కడి పరిస్థితి భీతావహంగా మారింది. ఇక ఇక్కడ కార్మికులే కాదు..అందులో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులు కూడా ఉన్నారు. సిగాచి రసాయన పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ దుర్మరణం పాలయ్యారు. గోవన్ ప్లాంట్‌లోకి అడుగుపెట్టిన సమయంలోనే పేలుడు సంభవించింది. ప్రమాదంలో కడపజిల్లాకు చెందిన ఓ ప్రేమజంట పెళ్లి చేసుకున్న మధురజ్ఞాపకం మరువకుండానే అనంతలోకాలు పోయారు. మొన్నటికి మొన్న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమాన ప్రమాద ఘటనకు సంబంధించిన విషాదం మరువక ముందే ఈ ఘటన జరగడం విచారకరం. పరిశ్రమల్లో భద్రతపై త్వరలోనే ఓ కమిటీ వేస్తామని కార్మిక మంత్రి వివేక్ తెలిపారు. అధిక పనిగంటలపై కార్మికులు ఫిర్యాదు చేస్తే లేబర్ కమిషన్ దర్యాప్తు చేస్తుందన్నారు. ఫిర్యాదు చేయడం కాదు...అలా జరుగుతుందా లేదా అన్న విషయం ఆరా తీయాల్సింది కార్మికశాఖనే. ఈ పరిశ్రమలో మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ అనే పౌడర్ తయారు చేస్తున్నారు. గత 40 ఏళ్లుగా ఈ సంస్థ పని చేస్తోందని తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పలు రసాయన పరిశ్రమల భద్రతపై అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎక్కడైన ప్రమాదం జరిగినప్పుడే యాజమాన్యాలు పలు జాగ్రత్తలు తీసుకుంటాయి. తర్వాత భద్రతా పరమైన అంశాల జోలికి వెళ్లడం లేదు. ముఖ్యంగా రసాయన పరిశ్రమలను చాలా జాగ్రత్తగా నిర్వహించాల్సి ఉంటుంది. రసాయనాల మధ్య ఒత్తిడి పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అందుకే కంపెనీకి సంబంధించిన ఇంజినీర్లతో యంత్రాలను తనిఖీ చేయించాలి. జిల్లా అధికారులూ పరిశ్రమలను నిరంతరంగా తనిఖీ చేయాలి. కాలుష్య నియంత్రణ మండలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి, అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీలకు వెళ్తుంటారు. వీరు తనిఖీలు చేసి ఏడాది నుంచి రెండేళ్ల కాలపరిమితికి అనుమతులు ఇస్తుంటారు. క్షుణ్ణంగా పరిశీలన చేయకపోవడంతో ఇలాంటి ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం పరిశ్రమల నిర్వహణ ఉండాలి. ఇవి కాగితాల్లోనే కనిపిస్తాయి. ప్రతి పరిశ్రమలలో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ వాహనాలు, సిబ్బంది ఉండాలి. అంతేకాదు అగ్నిమాపక సిబ్బందిని వారే నియమించుకోవాలి. ఈ కార్మికులు మూడు షిఫ్టుల్లో పనిచేయాలి. కానీ ఒక్కరిని కూడా నియమించు కోలేదు. నైపుణ్యం కలిగిన కార్మికులను తీసుకోవట్లేదు. తక్కువ వేతనాలు ఇస్తూ ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలనే పనిలోకి తీసుకుంటున్నారు. చిన్నచిన్న ప్రమాదాల బారినపడి కార్మికులు మృతిచెందిన విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇవన్నీ ఇకనుంచి బంద్ కావాలి. క్షేత్రస్థాయిలో ఒక్కో పరిశ్రమను అడుగడుగునా తనిఖ్ఖ్ చేయాలి. నిపుణుల బృందంద పరిశీలించాలి. అప్పుడే ప్రమాదాలను కొంతయినా నివారించగలుగుతామని గుర్తించాలి.

## సిగాచీ పరిశ్రమలో కడప నవదంపతుల అదృశ్యం

**కడప,జూలై1(జై భీమ్ న్యూస్):**

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం పలు కుటుంబాల్లో విషాదం నింపింది. ప్రమాద సమయంలో కంపెనీలో పనిచేస్తోన్న కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన నిఖిల్‌రెడ్డి, శ్రీరమ్య ఆచూకీ గల్లంతైంది. నిఖిల్‌రెడ్డి ఇటీవలే ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన నామాల శ్రీరమ్యను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ ఆషాఢ మాసం తర్వాత పెద్దల సమక్షంలో ఘనంగా వేడుక చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో సోమవారం సిగాచీ ఔషధ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో దంపతులిద్దరూ దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇరు కుటుంబాలకు చెందిన వారు శోకసంద్రంలో మునిగిపోయారు.

# గాజాపై కొనసాగిన ఇజ్రాయిల్ దాడులు

**తాజాగా 95మంది పాలస్తీనియన్ల మృతి**
**దాడుల్లో మహిళలు, స్కూలు పిల్లల మృతి**

**గాజా,జూలై1(జై భీమ్ న్యూస్) :**

గాజాపై ఇజ్రాయెల్ దళాలు మరోమారు బాంబుల వర్షం కురిపించాయి. మంగళవారం గాజాలోని కేఫ్, పాఠశాల, శరణార్థి శిబిరాలపై వైమానిక దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 95మంది పాలస్తీనియన్లు చనిపోయారు. ఈ దాడుల్లో పౌర మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పాఠశాలలు, కేఫ్‌లు, ఆహార పంపిణీ కేంద్రాలు లక్ష్యంగా దాడులు జరిగాయి. 95 మంది పాలస్తీనియన్లు చనిపోగా, వీరిలో చాలా మంది సాధారణ పౌరులు ఉన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఉన్నారు. ఉత్తర గాజాలోని అల్-బఖా కెఫెటేరియాపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 39 మంది మృతిచెందారు. డజన్ల కొద్దీ మంది గాయపడ్డారు. మృతుల్లో ఓ జర్నలిస్ట్ ఇస్మాయిల్, మహిళలు, పిల్లలు ఉన్నారు. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఈ దాడి చేశాయి. ఈ బాంబు దాడిలో కేఫ్ నేలమట్టమైంది. భూమిలో పెద్ద గొయ్యి ఏర్పడింది. సోమవారం కూడా ఇజ్రాయెల్ దళాలు గాజా నగరంలోని జీటౌన్ పరిసరాల్లో దాడులు చేశారు. శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్? వైమానిక దాడి చేయగా 13 మందిని చనిపోయారు. ఇజ్రాయెల్ సైన్యం గాజా నగరంలోని యాఫా పాఠశాలపై కూడా బాంబు దాడి చేసింది. ఇది వందలాది మంది పాలస్తీనియన్లకు ఆశ్రయం కల్పిస్తోంది. ధ్య గాజాలోని ఓ ఆస్పత్రిపై కూడా ఇజ్రాయెల్? దళాలు విరుచుకుపడ్డాయి. వేలాది కుటుంబాలు ఆశ్రయం పొందిన దేయిర్ ఎల్‌బలాలోని అల్ అక్సా ఆస్పత్రి ప్రాంగణంపై ఇజ్రాయెల్ దళాలు దాడి చేశాయి. హమాస్ మిలిటెంట్లను లక్ష్యంగా దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. పౌరులు ఉన్న ప్రాంతాల నుండి హమాస్ పనిచేస్తోందని అందువల్ల ప్రజల మరణాలకు హమాస్ కారణమని ఇజ్రాయెల్ ఆరోపిస్తుంది. దాడులు చేసే ముందు పౌరులను హెచ్చరిస్తున్నామని ఇజ్రాయెల్? తెలిపింది. ఈ దాడులపై ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. పాఠశాలలు, ఆసుపత్రులు, ఇతర పౌర ఆశ్రయాలపై దాడులు అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన అని మానవ హక్కుల సంస్థలు ,ఐక్యరాజ్యసమితి చెబుతున్నాయి. ఈ సంఘటనలు గాజాలో నెలకొన్న తీవ్ర మానవతా సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేశాయంటున్నారు.

## సిగాచి పరిశ్రమలో 45కు చేరిన మృతుల సంఖ్య

**క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమం**
**కొనసాగుతున్న సహాయక చర్యలు**

**పటాన్‌చెరు,జూలై1(జై భీమ్ న్యూస్):**

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మాస్యూటికల్ కంపెనీలో జరిగిన భారీ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నది. రియాక్టర్ పేలుడుతో ఇప్పటివరకు 45 మంది మరణించారు. వివిధ దవాఖానల్లో మరో 31 మంది చికిత్స పొందుతున్నారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే మరణించినవారిలో ఎక్కువ మంది తమిళనాడు, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందినవారే ఉన్నారు. ఇప్పటివరకు ఏడు మృతదేహాలను గుర్తించగా, మరో 20 గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. సోమవారం జగన్మోహన్, రామ్‌సింగ్ రాజ్‌బర్, శశిభూషణ్ కుమార్ మృతిచెందినట్లు గుర్తించగా, తాజాగా మరో ఆరుగురి పేర్లను అధికారులు ప్రకటించారు. లగ్నజిత్ దౌరి, బీ.హేమ సుందర్, రుక్సానా కతూన్, జీ.నికిల్ రెడ్డి, నాగేశ్వర్ రావు, పొలిషెట్టి ప్రసన్నగా గుర్తించారు. డీఎన్ఏ పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించే అవకాశం ఉన్నది. అయితే మృతుల సంఖ్య 55కు పెరిగే అవకాశం ఉంది. బాయిలర్ పేలడంతో మూడంతస్తుల అడ్మినిస్ట్రేన్ భవనం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఆ శిథిలాల కింద 20 మంది కార్మికులు చిక్కుకున్నారు. వారి కోసం ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, హైడ్రా, ¸÷ర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ధ్వంసమైన ఎ÷-లాంట్‌ను పక్కకు తొలగించారు. కాగా, ప్రమాదంపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఉదయం అధికారిక ప్రకటన చేశారు. మొత్తం 47 మంది గల్లంతయ్యారని, ఇప్పటి వరకు 26 మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయని తెలిపారు. 20 మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయని చెప్పారు. 27 మంది కార్మికుల ఆచూకీ తెలియాలేదన్నారు. తీవ్ర గాయాలతో 35 మందికి దవాఖానల్లో చికిత్స అందుతున్నదని, అందులో 11 మంది పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. 57 మంది సురక్షితంగా ఇంటికి వెళ్లారని తెలిపారు.

## సమస్యలకు సమాధానం లేదు

**తప్పించుకునేందుకే విదేవీ యానం**
**మోడీ విదేశీ పర్యటనపై జైరామ్ రమేశ్ విమర్శలు**

**న్యూఢిల్లీ,జూలై1(జై భీమ్ న్యూస్):**

తరచుగా విదేశాలకు ప్రయాణించే సూపర్ ప్రీమియమ్ ప్రధాని ఐదు దేశాల 'విహారయాత్ర'కు బయలుదేరారని కాంగ్రెస్ పార్టీ ప్రధాని మోడీని ఎద్దేవా చేసింది. మణిపూర్ ఉద్రిక్తతలు, భారత్ మరియు పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వాదనలు సహా నాలుగు అంశాలపై సమాధానం చెప్పకుండా ప్రధాని మోడీ తప్పించుకుంటున్నారని మండిపడింది. ప్రధాని మోడీ నిర్ణయం వల్లే ఆపరేషన్ సిందూర్‌లో మొదటి రెండు రోజుల్లో భారత్ తిరోగమనం ఎదుర్కొందని రక్షణ అధికారులు వెల్లడించిన ఆరోపణల నుండి ప్రధాని పారిపోతున్నారని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జ్ కమ్యూనికేషన్స్ జైరాం రమేష్ ఆరోపించారు. ఆపద,కష్టసమయంలోనూ కొందరు వ్యక్తులు ధైర్యంగా ముందుకు సాగుతారు. కానీ తప్పించుకునేందుకు 'తరచుగా విదేశాలకు ప్రయాణించే' మన ప్రధాని 8 రోజుల విహార యాత్రకు బయలుదేరారు' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశాన్ని ఆందోళనకు గురిచేస్తున్న నాలుగు సమస్యల నుండి ఆయన పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ పట్టాలు తప్పినప్పటి నుండి, అక్కడి ప్రజలు సాధారణ జీవన పరిస్థితుల నుండి దూరమైనా ప్రధాని మోడీ ఒక్కసారి కూడా మణిపూర్ సందర్శించలేదని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ప్రధాని మోడీ నిర్ణయాల కారణంగా భారత్ కొంత మేర నష్టాన్ని ఎదుర్కొందని రక్షణ అధికారులు వెల్లడించిన వార్తలపై సమాధానం చెప్పకుండా తప్పించుకునేందుకు ప్రధానిమోడీ పారిపోతున్నారని జైరాం రమేష్ మండిపడ్డారు. బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ సమ్మిట్ పాల్గొనడంతో పాటు ఎనిమిదిరోజుల పర్యటనలో ప్రధాని మోడీ గనా, ట్రినిడాడ్, టొబాగో, అ÷-జ్గ÷ంటీనా, నమీబియాలను సందర్శించనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## విద్వేషాల చిట్టా

**జై భీమ్ న్యూస్ (హైదరాబాద్)**

దేశంలో ఒక్కొక్కచోట ఒక్కొక్క విద్వేషం ఒక్కొక్కచోట ఒక్కొక్క వివాదం ఒక్కొక్కచోట ఒక్కొక్క విధ్వంసం వెరసి సమైక్యతాభావం విస్మృతిలోకి జారుతున్నది. ప్రజల మధ్య సోదరాభావం, పరమత సహనాన్ని క్రమంగా కొడిగట్టించడానికి పాలకులు చేయని ప్రయత్నమంటూ లేదు. మోడీ 3.0 పాలనలో మొదటి ఏడాదిలో విద్వేష నేరాలపై అధ్యయనం చేస్తే 937 హేట్ క్రైమ్స్ తేలాయి. వీటిలో విద్వేష ప్రసంగాలదే పెద్దపీట. అందునా మైనార్టీలపై భౌతిక దాడులే అధికం. ఈ ఘటనల్లో ఎందరో ప్రాణాలు కోల్పోయారు.'హేట్ క్రైమ్ రిపోర్ట్: మ్యాపింగ్ ఫస్ట్ ఇయర్ ఆఫ్ మోడీస్ థర్డ్ గవర్నమెంట్' పేరిట రూపొందించిన తన అధ్యయన నివేదికను "పౌర హక్కుల పరిరక్షణ సమాఖ్య (ఏపీసీఆర్)" బట్టబయలు చేసిన లెక్కలివి. మోడీ ప్రభుత్వంలో చెప్పుకోవటానికి ఏ ఘనతా లేక, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం చెప్పలేక, ఎన్నికల్లోకి బీజేపీ మతాన్ని లాక్కొస్తున్నది చూస్తూనే ఉన్నాము. కనీస వివేచన, విచక్షణ లేకుండా అవాకులూ చెవాకులతో ఎన్నికల ప్రచారం లోకి దిగడం ఆ పార్టీ నైజం. "మతమనేది వ్యక్తిగతం. దాన్ని వీధుల్లోకి, విమర్శల్లోకి తీసుకురాకండి" అని దేశ సర్వోన్నత న్యాయస్థానం గతంలో గట్టిగా నిర్దేశించినా, ఎన్నికల నిబంధనావళిలో స్పష్టంగా రాసు కున్నా నాయకులకు అవి పట్టడం లేదు. సామరస్యాన్ని, సంయమనాన్ని పాటించాల్సిన ప్రధాని స్థాయి వ్యక్తి విద్వేష ప్రచారానికి ఆరంభం పలకటం మరింత దారుణం. ఏ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నా రాముడిని రాజకీయ దినుసుగా వాడబూనటం గర్హనీయం. అసత్యాలు వల్లించడం పచ్చి అబద్ధాలు వండి వార్చడంలో వారికి వారే సాటి. దేశ సమగ్రతను కాపాడుతామంటూ ప్రమాణాలు చేసి ఢిల్లీ గద్దెనెక్కిన నేతలే సమాజాన్ని మెజారిటీలు మైనార్టీలుగా చీల్చుతున్నారు. ఏకోన్ముఖంగా.. పురోగమనం దిశగా జాతిని ప్రేరేపిం చాల్సిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు మధ్యయుగాల నాటి మత ఛాందసం లోకి దేశాన్ని దింపు తున్నారు. ఇది మన దేశ దౌర్భాగ్యం. దేశంలో అడుగడు గునా అమలవుతున్నది 'విభజించు-పాలించు' నీతి. ఇది ఎందుకు చేస్తున్నారో? ఏం ఆశించి చేస్తున్నారో అన్నది బహిరంగ రహస్యమే. ఆర్థిక, సామాజిక, రాజకీయ పాలనా వైఫల్యా లను కప్పిపుచ్చు కోవడం, వాటి నుంచి జనం దృష్టిని మళ్లించి అధికారాన్ని నిలబెట్టుకో వాలన్నదే ఇందులోని కుటిల పన్నాగం. ప్రజల దైనందిన సమస్యలను పక్కనపెట్టి, సెంటిమెంట్లతో మద్దతు కూడగట్టాలనుకోవడం క్షమార్హం కాని మోసకారితనం. మోడీ ఉద్దేశపూర్వకంగా విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణిని వారి విధానంగా కొనసాగిస్తున్నారు. మోడీ పాలనలో దేశ సార్వభౌమత్వం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ పునాదుల్ని విచ్ఛిన్నం చేసే వికృత క్రీడ రోజురోజుకు వేళ్లూనుకుంటుంది. బీజేపీ పాదుకొల్పుతున్న విభజన రాజకీయాల ప్రభావం, పర్యవసానాలు లోతుగా పరిశీలిస్తే వెన్నులో వణుకు పుట్టక మానదు. అంతా విధ్వంసమే. ఉమ్మడిగా జీవి స్తున్న జాతిలో మెజారిటీ వాదం, మైనార్టీ వాదం, మతతత్వం.. కులతత్వం.. ఏదైనా సరే ఒకసారి మొగ్గతొడితే ఆ వేరు భావనను రూపుమాపటం కష్టతరం. ఉన్మాదం తలకెక్కి వెర్రితలలు వేశాక చేసేదేం ఉండదు. అంతా హింస, అశాంతి. ఆద్యులైన వారే కాదు, నేడు చోద్యం చూసిన వారూ బలికాక తప్పదు. ఉన్మాదం అలాంటిది. చరిత్ర పుటలను తిరగేస్తే అలా కాలగర్భంలో కలిసిన జాతులు, నెత్తుటి ధారలెన్నో ఉదంతాలుగా మనకు కండ్ల ముందు తారాసపడతాయి. తిండిపై, బట్టలపై, భాషపై ఒకటేమిటీ చెప్పుకుంటూ పోతే ప్రజల జీవితాలపై ఆంక్షల కత్తి వేలాడుతూనే ఉంది. ఆచారాలు, కట్టుబాట్లపై విద్వేషాన్ని చిమ్ముతున్నవో, మరెంతగా వాటిని అసహ్యించుకుంటున్నవో.. రేపు మిగతా మతాలు, వర్గాలపైనా అదే తరహాలో విరుచుకుపడతాయి. అందుకు ఇటీవల దేశంలో చోటుచేసుకున్న సంఘటనలే నిదర్శనం. "ఒకవైపు దేశమేమో మతాలుగా కులాలుగా ముక్కల వుతోంది మరోవైపు పెట్టుబడేమో సంపదగా, దోపిడీగా ఏకమవుతోంది మన నాయకుడేమో ప్రజలను వంచిస్తూ, పెట్టుబడికి ఊడిగం చేస్తూ బలపడుతున్నాడు.." అంటాడో ప్రజాకవి. ఈ కవి వాక్కులు ఎంత అక్షర సత్యాలో చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి?

## అందుబాటులోకి వచ్చిన రైలువన్ యాప్

**రైల్వే ప్రయాణికులకు అందుబాటులోకి సేవలు**

**న్యూఢిల్లీ,జులై 1(జై భీమ్ న్యూస్) :**

రైలు ప్రయాణీకులకు శుభవార్త. ఇక రైలు సవేలన్నీ ఒకే చోట పొందవచ్చు. సిఆర్ఐఎస్ 40వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా రైల్వే మంత్రిత్వ శాఖ 'రైల్‌వన్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌ను మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ యాప్ ఆండ్రాయిడ్ ప్లే స్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ రెండింటిలోనూ అందుబాటులో ఉంది. రైల్‌వన్ యాప్ అనేది ప్రయాణీకుల అన్ని ముఖ్యమైన సేవలకు ఒక-స్టాప్ వంటిది. ఈ యాప్ ద్వారా, ప్రయాణీకులు టిక్కెట్లు కొనడం, ? రిజర్డ్, అన్‌రిజర్డ్, ఎ÷-లాట్‌ఫామ్ టిక్కెట్లు, రైలు, పిఎన్ఆర్ ఎంక్వైరీ, జర్నీ ఎ÷-లానింగ్, రైలు సహాయ సేవలు, రైలులో భోజనం బుకింగ్, సరుకు రవాణా సంబంధిత విచారణలు కూడా ఇందులో అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్ ప్రాథమిక లక్ష్యం మెరుగైన వినియోగదారు అనుభవాన్ని అందించడం, ఇది సరళమైన, స్పష్టమైన యూజర్ ఇంటర్‌ఫేస్ ద్వారా గ్రహించబడుతుంది. ఇది అన్ని సేవలను ఒకే చోట అనుసంధానించడమే కాకుండా, సేవల మధ్య సమగ్ర కనెక్టివిటీని కూడా అందిస్తుంది, వినియోగదారుకు భారతీయ రైల్వే సేవల సమగ్ర ప్యాకేజీని అందిస్తుంది. ఈ యాప్ ప్రత్యేక లక్షణం సింగిల్ సైన్-ఆన్. ఇది వినియోగదారులు బహుళ పాస్‌వర్డ్‌లను గుర్తుంచుకోవాల్సిన అవసరాన్ని తొలగిస్తుంది. రైల్‌వన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసిన తర్వాత, రైల్‌కనెక్ట్ , యుటిఎస్ ఆన్ మొబైల్ యాప్ ప్రస్తుత యూజర్ ఐడిని ఉపయోగించి లాగిన్ చేయవచ్చు. వినియోగదారులు వేర్వేరు సేవల కోసం ప్రత్యేక యాప్‌లను కలిగి ఉండనవసరం లేదు కాబట్టి ఇది పరికరంలో నిల్వను ఆదా చేస్తుంది. ఈ యాప్ రైల్వే ఇ-వాలెట్ సౌకర్యంతో కూడా వస్తుంది. సంఖ్యా ఎంపిన్, బయోమెట్రిక్ లాగిన్ వంటి సులభమైన లాగిన్ ఫీచర్‌లు కూడా అందించబడ్డాయి. కొత్త వినియోగదారుల కోసం, రిజిస్ట్రేషన్ కనీస సమాచారంతో జరుగుతుంది, ఇది రిజిస్ట్రేషన్ పక్రియను సులభతరం చేస్తుంది. వేగవంతం చేస్తుంది. విచారణలు మాత్రమే చేసే వినియోగదారులు మొబైల్ నంబర్ , ఓటిపి ఉపయోగించి అతిథి లాగిన్‌ని ఉపయోగించి కూడా లాగిన్ అవ్వవచ్చు.

జై భీమ్ POWER OF PEOPLE

# ప్రైవేటు స్కూల్ దోపిడీలను అరికట్టండి





### వరంగల్ జిల్లా విద్యశాఖ అధికారి సూపర్డెంట్ జ్యోతికి వరంగల్ జిల్లా బీఎస్పీ నాయకుల విన్నపం

**జై భీమ్, జూలై 1 వరంగల్**

వరంగల్ జిల్లాలోని పలు ప్రైవేటు స్కూల్ లో విద్యార్థుల తల్లిదండ్రులను అధిక ఫీజు వసూలు చేస్తున్న యాజమాన్యం విద్యార్థులు చదివే ప్రైవేటు పాఠశాలలోనే విద్యార్థులకు బుక్స్ స్కూల్ యూనిఫామ్ షూస్ చివరికి సాక్స్ లో తో సహా అమ్మడం జరుగుతుంది ప్రైవేట్ స్కూలు యాజమాన్యం వాళ్లు నిర్ణయించిన ధరకే అమ్మడం విద్యార్థుల తల్లిదండ్రులు మా పిల్లలకు మేము బయట బుక్స్ కొనుక్కుంటాము స్కూల్ డ్రెస్సు బయట కుట్టిస్తాము అని ఎంత మొరపెట్టుకున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం మొండిగా వైఖరిస్తున్న వైనం మధ్యతరగతి కుటుంబాలు తాము ఉన్నంత చదువు చదువుకోలేదు తమ పిల్లలకైనా ప్రైవేట్ స్కూల్లో చదివిస్తే ప్రయోజకులవుతారని స్కూలుకు పంపితే ఇక్కడేమో ముక్కు పిండి మరి ఫీజులు వసూలు చేస్తూ పిల్లల తల్లిదండ్రులను నానా ఇబ్బందులకు గురి చేస్తూ మనోవేదనకు పాల్పడుతున్నారు ప్రవేట్ స్కూల్ నడిపే యాజమాన్యం విద్యార్థులకు స్కూల్లో ఏలాంటి బుక్స్ గాని స్కూల్ యూనిఫామ్ గానీ విక్రయించ వద్దు అని ప్రభుత్వం చెప్పిన పెడచెవిన పెట్టిన ప్రైవేట్ స్కూలు యాజమాన్యం ప్రభుత్వం అధికారులు ఇకనైనా మేలుకొని వరంగల్ జిల్లా డీఈవో విద్యాశాఖ అధికారులు వరంగల్లో ఉన్నటువంటి ప్రైవేటు స్కూళ్లపై విచారణ చేపట్టి ప్రైవేటు స్కూలు యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటూ అనుమతులు లేనివి ప్రైవేట్ పాఠశాలలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ నుండి డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు బస్కే నాగరాజు వరంగల్ జిల్లా ఇన్చార్జ్ జన్ను అనిల్ కుమార్ ఉపాధ్యక్షులు వనం మహేందర్ ప్రధాన కార్యదర్శి పోలేపాక శ్రీధర్ వరంగల్ తూర్పు అధ్యక్షులు పోలేపాక లోకేష్ వర్ధన్నపేట ఇంచార్జ్ బరుపట్ల నవీన్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో వైద్య వృత్తికి న్యాయం చేకూరుతుంది







### జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా వైద్యవృత్తికి న్యాయం చేకూర్చడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిస్ అన్నారు. బి ఎస్ రాయ్ వైద్యరంగంలో చేసిన సేవలు గుర్తుగా జుల్కై 1న భారతదేశంలో డాక్టర్స్ డే నిర్వహించుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో డాక్టర్స్ డే పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజలను చేసి కలెక్టర్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరు అయ్యి జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా వైద్య అధికారులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేసినారు. ప్రతి పేదవాడికి వైద్యం అందాలని, ఆరోగ్య తెలంగాణ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, తాను కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయ్యానని, ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయ్యేవిధంగా ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీని ప్రోత్సహించాలని కోరినారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు వినియోగించుకోవాలని, ప్రతి వైద్యుడు అంకితభావంతో ప్రజలకు మెరుగు మెరుగైన సేవలు అందించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్ల యొక్క సేవలు మరువలేనివని అందరికీ జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ కె. రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.సి రాయ్ సేవలు మర్చిపో లేవని, ప్రతి పేదవానికి వైద్య సేవలు అందాలని, ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకొస్తునది తెలియజేశారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అక్కయ్య మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా, సమన్వయం తో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిద్దామని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించే లా, నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్యని, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె రామ్కుమార్ రెడ్డిని, అడిషనల్ వైద్య అధికారిడాక్టర్ టి.మదన్ మోహన్ రావుని, జిల్లా ఇమ్యూనిజషన్ అధికారి డాక్టర్ మహేందర్ ని, జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ హిమబిందుని, ప్రోగ్రామ్ అధికారి ఎంసి హెచ్ డాక్టర్ మంజులని,ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇన్ సిడి డాక్టర్ అహ్మద్ ని, జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించారు. హన్మకొండ జిల్లాలో పనిచేస్తున్నటు వంటి వైద్యులలో హాస్టల్స్ మరి స్కూల్స్ సందర్శన ఎక్కువ చేసిన డాక్టర్స్ ని మరియు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో టిడి ఏ.ఆర్.వి, అస్వ్ అందుబాటులో ఉంచినటువంటి మరియు అత్యధిక సంఖ్యలో ఇంజక్షన్లు ఇచ్చినటువంటి ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరాలకు ప్రశంసా పత్రాల ప్రధానం చేయడం జరిగింది. వైద్యుల క్రీడాఉత్సవాలలో బహుమతులు పొందిన వైద్యులకు ప్రశంస పత్రము, కప్ బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, బస్తీ, పల్లె దవాఖాన వైద్యాధికారులు, ఆర్ బి ఎస్ కే వైద్యాధికారులు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీ కోలా రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




# నిషేధిత దగ్గు మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపులో పోలీస్ తనిఖీలు

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం అందిన సమాచారం మేరకు మంగళవారం రోజున పోలీసులు స్థానిక డ్రగ్ అధికారి కిరణ్ తో రంగశాయి పేట లోని ఆయుష్ మందుల షాపులో విస్తృతమైన తనిఖీలు చేయగా మత్తు కలిగించే ప్రభుత్వ నిషేధిత దగ్గు మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు పెద్ద ఎత్తున నిషేధిత దగ్గు మందులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ శివ కేశవులు, ఆర్.ఎస్.ఐ మనోజ్, పూర్ణ, నాగరాజు తో యాంటీ డ్రగ్స్ కంట్రోల్ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# కర్ణాటక గ్రాండ్ ప్రిక్స్ ఓపెన్ టైక్వాండో ఛాంపియన్‌షిప్-2025




**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కర్ణాటక గ్రాండ్ ప్రిక్స్ ఓపెన్ టైక్వాండో ఛాంపియన్‌షిప్ -2025 ఘనంగా నిర్వహించారు. ఆదివారం మమతా కన్వెన్షన్ హాల్, కడబాగెరె క్రాస్ మాగడి మెయిన్ రోడ్, బెంగళూరు లో నిర్వహించారు. ఈ పోటీల్లో బెంగళూరులోని కె.ఆర్. రోడ్‌లోని పాంథర్స్ టైక్వాండో అకాడమీ (రి) విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభతో అథ్లెట్లు మొత్తం 14 బంగారు పతకాలు, 12 రజత పతకాలు మరియు 05 కాంస్య పతకాలను గెలుచుకున్నారని కోచ్ సతీష్ కుమార్ ఎస్ తెలిపారు.

# యూత్ కాంగ్రెస్ బృందాన్ని అభినందించిన రాష్ట్ర అధ్యక్షుడు

### యువతకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే రేవూరి



**హైదరాబాద్ జై భీమ్ న్యూస్:-**

జాతీయ, రాష్ట్ర ఆదేశాలు ఇచ్చినటువంటి ప్రతి కార్యక్రమాన్ని పరకాల నియోజకవర్గంలో విజయవంతం చేస్తున్నందుకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కేఆర్ దిలీప్ రాజ్,ఇన్చార్జులు పడాల రాహుల్,అశ్విన్ రాథోడ్ సమక్షంలో పరకాల యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ ను శాలువాతో సత్కరించి మొత్తం కమిటీ బృందాన్ని అభినందించారు.ఇదే ఉత్సాహంతో ప్రతి ఒక్కరు కష్టపడి పని చేస్తే కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఉన్నతమైన పదవులు అందిస్తుందని భరోసానిచ్చారు.అనంతరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మాదాసి శ్రీధర్ మాట్లాడుతూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నియోజకవర్గంలో యువతకు ఎల్లవేళలా అండగా ఉంటూ ప్రతి కార్యక్రమాలలో యువతకు అండగా ఉంటూ ఆదర్శవంతంగా నిలుస్తున్నా ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కేఆర్ దిలీప్ రాజ్ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు,జిల్లా ప్రధాన కార్యదర్శులు, మండలాల అధ్యక్షులు, నియోజకవర్గ ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు మండల ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,కార్యదర్శులు, యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదవీ విరమణ అనంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

పదవీవిరమణ అనంతరం పోలీస్ అధికారులు తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సుధీర్ఘ కాలం పని చేసి పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ సోమవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. పదవీ విరమణ పొందిన వారిలో, ఎస్.ఐలు విద్యాసాగర్, గాలిబ్, సూర్యనారాయణ, పిలిప్ రాజు, యాకుబ్, ఏ. ఎస్.ఐ లు గౌస్ పాషా, నాగేందర్ సింగ్, సంపత్, శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ వున్నారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మీ సేవలు నేటి తరం పోలీసులకు అదర్శంగా నిలుస్తుందని, నేటి ఈ ప్రశాంత వాతావరణానికి మీ సేవలే కారణమని, మీ అందించిన సేవలు మరువమని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో అదనపు డిసిపిలు రవి,సురేష్ కుమార్, శ్రీనివాస్ తో పాటు ఏసిపిలు,ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీస్




**భూపాలపల్లి, జై భీమ్ న్యూస్**

భూపాలపల్లి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమాన్ని సంబంధిత శాఖ అధికారులు విజయవంతం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీస్ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమంలో భాగంగా మంగళవారం వివిధ శాఖల సంబంధిత అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలను గుర్తించి, వారిని రక్షించి, పునరావాసం కల్పించి, సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పని ప్రదేశంలో ఉన్న పిల్లలను పోలీసు బృందాలు, వివిధ శాఖల సమన్వయంతో దాడులు నిర్వహించి, పిల్లలను పనిలో పెట్టుకునే యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు పట్టుబడిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించాలని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ అందించి, అనాథలుగా ఉంటే వారిని కేర్‌హోమ్‌కు తరలించే ప్రక్రియను దృష్టి పెట్టాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే 100 లేదా 1098కు డయల్ చేయాలని, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆపరేషన్ ముస్కాన్ ప్రతి ఏటా జూలై 1 నుంచి 31వ తేదీ వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించడం జరుగుతుందన్నారు. ఆపరేషన్ ముస్కాన్-10లో భాగంగా గతేడాది 24 పిల్లలకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ నరేష్ కుమార్, మల్లీశ్వరి, వెల్ఫేర్ కమిటీ మెంబర్ దామోదర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వినోద, ఇన్స్పెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు, ఎన్జీవో ఆర్గనైజేషన్లు, రెవెన్యూ, పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కేజీబీవీ, ఇందిరమ్మ ఇండ్లు, నర్సరీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్





**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

ఆత్మకూరు మండలం తిరుమలగిరిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ఇందిరమ్మ ఇండ్లు, నర్సరీని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం పరిశీలించారు. ఈ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణ పనులను పరిశీలించారు. సరిత అనే లబ్ధిదారుతో కలెక్టర్ మాట్లాడారు. ఏం పనులు చేస్తుంటారని కలెక్టర్ అడుగగా సరిత దంపతులు తాము వ్యవసాయం చేస్తామని సమాధానమిచ్చారు. రైతు భరోసా జమ అయ్యిందా అని కలెక్టర్ అడుగగా రైతు భరోసా జమ అయినట్లు తెలిపారు. ఈ గ్రామంలో ఎంతమందికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణానికి మేస్త్రి ఎంత తీసుకుంటున్నారని, ఇసుక కంకర, తదితర మెటీరియల్లు ఎక్కడినుండి తెచ్చుకుంటున్నారని కలెక్టర్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ నర్సరీని కలెక్టర్ సందర్శించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఏ ఏ రకాల మొక్కలను పెంచుతున్నారని, నర్సరీలో ఎన్ని మొక్కలు ఉన్నాయని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. విద్యాలయంలోని ప్రిన్సిపల్ రూమ్, లైబ్రరీ, స్టోర్ రూమ్, డార్మెట్రీ, టాయిలెట్స్, తరగతి గదులు, డైనింగ్ హాల్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, స్థానిక తహసిల్దార్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ విజయ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్..**

ఆత్మకూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన పలు వివరాలను డాక్టర్ చైతన్య అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది, మందులు, ఓపి సేవలను గురించి వైద్యులను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగాలి






**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ సంఖ్యలో విద్యార్థుల నమోదు పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండలం అక్కంపేటలోని అంగన్వాడీ కేంద్రం, పీఎంశ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ముందుగా అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారుల అభ్యసన విధానం గురించి అంగన్వాడీ టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రానికి సంబంధించి రికార్డులను గురించి విచారించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఒకటి, రెండు, ఐదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ ఇచ్చారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా అటెండెన్స్ తీసుకుంటున్న విధానం గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు సంబంధించి కే స్టడీ నమోదు చేస్తున్నారా అని ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కిచెన్ షెడ్ ను పరిశీలించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ఏం వండుతున్నారు అని వంట నిర్వాహకురాలిని అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తమ కాలనీకి రోడ్డు వేయించాలని కలెక్టర్ ను కోరగా పంచాయతీ కార్యదర్శి కి ప్రతిపాదనలు అందజేయాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ సంభాషించారు. ఎంతమంది విద్యార్థులు పాఠశాలకు వచ్చారని, ఫేషియల్ అటెండెన్స్ తీసుకున్నారా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలకు సంబంధించిన భవనం గురించి ఆరా తీసిన కలెక్టర్ ప్రాథమిక పాఠశాలకు ఆ పాఠశాల భవనాన్ని ఇవ్వాలని సూచించారు. డైనింగ్ హాలులో ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా అని కలెక్టర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ ను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలని, కేస్ స్టడీని నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ విజయ్ కుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్నాతకోత్సవం సందర్భంగా - జాతీయ సేవా పథకం కాంపస్‌లో వాలంటీర్ల క్లీన్ అండ్ గ్రీన్

**స్నాతకోత్సవ పనులను పర్యవేక్షిస్తున్న వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్**



**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**



23వ స్నాతకోత్సవ సందర్భంగా విశ్వవిద్యాలయ ఆడిటోరియం లో జరుగుతున్నా పనుల పురోగతిని వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తో కలిసి పరిశీలించారు, సూచనలు చేసారు, అదే విధంగా కాంపస్ జాతీయ సేవా పథకం 150 మంది వాలంటీర్ లు కాంపస్ లోని వివిధ ప్రాంతాల తో పాటు మొదటి గేటు నుంచి లైబ్రరీ వరకు క్లీన్ అండ్ గ్రీన్ చేపెట్టారు. ఈ కార్యక్రమం లో జాతీయ సేవ పథకం సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ, డెవలప్మెంట్ ఆఫీసర్ ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ లు డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ శైలజ, ఎం. సోజన్య, రజనికుమార్ తదితరలు పాల్గొన్నారు.

## ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**




**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**



నేరాల నియంత్రణతో పాటు, నేరస్థులను పట్టుకోవడంలో పోలీస్ అధికారులు ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చారు. జూన్ నెల సంబంధించి నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయములో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండిరగ్‌లో వున్న కేసులను సమీక్ష జరపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకై అర్బన్, మున్సిపల్, గ్రామ స్థాయిల్లోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతి వి.పి.ఓ వద్ద, నేరాల నియంత్రణకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇక ఉదయం 6గంటల వరకు పెట్రొలింగ్ కొనసాగించాలని, అలాగే పెట్రోలింగ్ నిర్వహించే సిబ్బంది నిర్వహించాల్సిన విధులపై ముందుగానే స్టేషన్ అధికారులు తెలియజేప్పాల్సి వుంటుందని. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి అంశంపై పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిప్పుడు పోలీస్ అధికారులు సంబంధిత ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో రోడ్డు ప్రమాదాలకు గల కారణలపై క్షేత్ర స్థాయిలో సమీక్ష జరపాలని సీపీ తెలిపారు. యువతను రక్షించుకోవడంలో భాగంగా డ్రగ్స్ అలవాటు పడి పోలీసులకు చిక్కిన యువతను పునరావస కేంద్రాలకు తరలించి చికిత్స అందించేందుకు కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని, పోలీస్ కమిషనర్ తెలియజేసారు. పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ తప్పనిసరిగా కేసులను నమోదు చేయాలని, ప్రధానంగా ప్రజావాణి నుండి ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాల్సి వుంటుందని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, వరంగల్,జనగాం ఏఎస్పీలు శుభం, చేతన్, అదనపు డిసిపిలు ప్రభాకర్, బోనాల కిషన్‌ఇ రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు,ఆర్.ఐలు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

## గిరిజన గురుకులాల ఔట్ సోర్సింగ్ సిబ్బందికి శుభవార్త

**అమరావతి,జులై 1(జై భీమ్ న్యూస్):**

గిరిజన గురుకులాల్లో ఔట్‌సోర్సింగ్ బోధనా సిబ్బంది వేతనాలను పెంచుతూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం 1659 మంది వేతనాలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. కేటగిరీ ఏలోని రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలను పెంచింది. జూనియర్ లెక్చరర్లు, పీడీ(సి), లైబ్రేరియన్లు, పీజీటీల వేతనాన్ని రూ.24,150, టీజీటీ పీడీ(ఎస్) వేతనాలు రూ.19,350, పీఈటీ, ఆర్ట్, క్రాఫ్ట్ మ్యూజిక్ సిబ్బంది వేతనం రూ.16,300కి పెంచింది. కేటగిరీ బీలోని స్కూళ్లు, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 40 మంది జూనియర్ లెక్చరర్లు, 18 మంది పీజీటీల వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో పీజీటీల వేతనాలు రూ. 25వేల నుంచి రూ.31,250కి పెరిగాయి. అరకు వ్యాలీ బాలుర స్పోర్ట్స్ స్కూల్‌లో కోచ్ వేతనాన్ని రూ. 25వేల నుంచి రూ. 31,250కి పెంచింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# బాధలు తీర్చే దైవం బల్కంపేట ఎల్లమ్మ





## అమ్మవారికి కళ్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించడం నా అదృష్టం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడి

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

హైదరాబాద్ ప్రజల బాధలు తీర్చే దైవం బల్కంపేట ఎల్లమ్మ అని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఆషాఢ మాసంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో బోనాల సందడి ఉంటుందని గుర్తు చేశారు. బోనం అంటే భోజనమని... గతంలో ఇక్కడ ఒక మహమ్మారి విభృంజిస్తున్న సమయంలో బోనాల సంస్కృతి వచ్చిందని... అది ఇక్కడి ప్రజల నమ్మకం అని మంత్రి చెప్పారు. హైదరాబాద్ మహా నగరంలో విపత్తు వచ్చి వందల మంది చనిపోతున్నప్పుడు బల్కంపేట ఎల్లమ్మ తల్లి రక్షణగా ఎందరో ప్రాణాలు కాపాడిందని గుర్తు చేశారు. బోనాల పండగ ఇక్కడి ప్రజలకు ఒక గొప్ప వేడుకగా మారిందన్నారు. ఈసారి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రజా ప్రభుత్వం రూ. 20 కోట్లు కేటాయించి, ఎక్కడా ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసిందన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తున్నారని... అందుకోసం సకల ఏర్పాట్లు చేసినట్టు గుర్తు చేశారు. మంగళవారం బల్కంపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగిందని... రాష్ట్ర ప్రభుత్వం పక్షాన అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం తనకి రావడం చాలా అదృష్టంగా ఉందన్నారు. అమ్మవారి కళ్యాణం సందర్భంగా రాష్ట్రమంతా మంచి వర్షాలు పాడి పంటకు ఆరోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి సురేఖ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులను మెరుగుపరచాలి

పి.డి.ఎస్.యు హనుమకొండ జిల్లా కార్యవర్గం



హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం హనంకొండ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో డీఈవో ఆఫీస్ లో సూపర్డెంట్ గారికి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వంశీకృష్ణ రంజిత్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం జిల్లా యంత్రాంగం అశ్రద్ధ వహించిందని తెలిపారు ముఖ్యంగా పాఠశాలలలో తాగునీటి సమస్య, మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉందని మరుగుదొడ్లు శుభ్రపరచడానికి కార్మికులు లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారి విద్యార్థులు ముఖ్యంగా మహిళా విద్యార్థులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని వారు తెలిపారు శాశ్వత త్రాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని వారు విచారం వ్యక్తం చేశారు పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకోవడానికి ఆట వస్తువులు లేక విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదగలేక పోతున్నారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. తక్షణం జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలని వారి సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శంకర్, రేవంత్, మోక్షిత్, జ్ఞానేశ్వర్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి లక్ష్మణ్ మర్యాదపూర్వం కలిసిన మందకృష్ణ మాదిగ

తెలంగాణ సచివాలయం హైదరాబాద్ లో వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ని కలిసిన మంద కృష్ణ మాదిగ విహెచ్పీఎస్ బృందం...



హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

వికలాంగుల పెన్షన్ తో పాటు ఇతర 25 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విహెచ్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నేతల బృందం మంత్రివర్యులు అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ని కలవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ వికలాంగుల సమస్యలను ఓపికగా వినడం జరిగింది. సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా స్పందించడం జరిగింది. మంత్రిని కలిసిన అనంతరం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మందకృష్ణ మాదిగ మాట్లాడడం జరిగింది.

# ఒక చేతో బిజెపి జెండా.. మరో చేత్తో కూటమి అజెండా

బిజెపి కొత్త అధ్యక్షుడు మాధవ్ వెల్లడి

**విజయవాడ,జులై 1(జై భీమ్ న్యూస్):**

బీజేపీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా చేసేలా పని చేస్తానని ఏపీ రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలను చేపట్టిన పీవీఎన్ మాధవ్ అన్నారు. ఒక చేతిలో బీజేపీ జెండా, మరో చేతిలో కూటమి అజెండాతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలను మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మంగలశారం స్వీకరించారు. ఈ పదవికి ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలను రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాధవ్‌కు అప్పగించారు. బీజేపీ ఏపీ అధ్యక్ష పదవి బాధ్యతలను స్వీకరించిన అనంతరం పీవీఎన్ మాధవ్ మాట్లాడారు. 'నేను రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్నాను. పార్టీ, తను వేరు కాకుండా మా నాన్నగారు పని చేశారు. అత్యంత సాధారణంగా పని చేస్తున్న ప్రతీ కార్యకర్త పర్యటన ద్వారా కార్యక్రమాలు చేస్తారు. పదవి ఒక బాధ్యత అని సంఘంలో నేర్పించారు. బీజేపీని రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా చేసేలా పని చేస్తాను. ఆర్ఎస్ఎస్ ప్రారంభం అయ్యి 100 సంవత్సరాలు పూర్తయిన సంవత్సరం 2025. ఎమ్జ్గ్ ÷న్సీకి 50 సంవత్సరాలు పూర్తయిన సంవత్సరం 2025. 2025లో అధ్యక్షుడిగా నేను బాధ్యతలు తీసుకోవడం నాకు ఆనందదాయకం. బాషా మధ్యమాన్ని రద్దు చేసి గత ప్రభుత్వం కళంకాన్ని తెచ్చింది. తెలుగును శాసన భాషగా తయారు చేసేలా పని చేస్తాం. ఒక చేతిలో బీజేపీ జెండా, మరో చేతిలో కూటమి అజెండాతో ముందుకు వెళ్ళాలి. యోగాంధ్రను ముందుకు తీసుకువెళ్ళాలి' అని మాధవ్ అన్నారు.

# వరల్డ్ బుక్ రికార్డు సాధించిన వేదార్థ్ వడ్లూరిని అభినందించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

చిన్న వయసులోనే రచయితగా వరల్డ్ బుక్ రికార్డు సాధించిన వేదార్థ్ వడ్లూరిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అభినందించారు. కరీంనగర్, హుజురాబాద్ కు చెందిన వేదార్థ్ వడ్లూరి 143 పేజీల స్కోరాబ్: లస్ట్రస్ లవ్ పుస్తకాన్ని రచించి వరల్డ్ బుక్ రికార్డు సాధించారు. మంగళవారం హన్మకొండ ఎంపీ క్యాంపు కార్యాలయంలో వరల్డ్ బుక్ రికార్డు సాధించిన వేదార్థ్ వడ్లూరిని ఎంపీ డా.కడియం కావ్య శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే, వేదార్త్ అసాధారణమైన కవితా ప్రతిభను ప్రదర్శించి, ప్రేమ యొక్క సారాన్ని సంగ్రహించి రాయడం గొప్ప విషయం అన్నారు. అతని రచన భావోద్వేగాలు, మానవ సంబంధాల అందాన్ని అన్వేషిస్తుందన్నారు. వేదార్త్ భాషపై పాండిత్యం, పదాలు పాఠకులను మంత్రముగ్ధులను చేస్తుందన్నారు. ఇది ఔత్సాహిక కవులు మరియు రచయితలకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. జీవితంలో ఇంత చిన్న దశలో కవిత్వం పట్ల వేదార్త్ కు ఉన్న అంకితభావం అతనికి ఇంతటి గుర్తింపును సంపాదించిపెట్టిందని తెలిపారు. భవిష్యత్తులో గొప్ప రచయితగా మరింత పేరు ప్రఖ్యాతలు సాధించాలని వేదార్త్ ను ఎంపీ డా.కడియం కావ్య ప్రోత్సహించారు.

# ఘనంగా ప్రపంచ వైద్యుల దినోత్సవం



చౌటుప్పల్, జై భీమ్ న్యూస్

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం విజయ ధన్వంతరి గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు గట్టు సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులతో కలిసి చౌటుప్పల పట్టణ కేంద్రంలో మంగళవారం రోజున ప్రపంచ వైద్యుల దినోత్సవ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ పాండురంగం,డాక్టర్ అలివేలు విజయకుమార్, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ చారి లను ఘనంగా శాలువాలతో సన్మానించి ప్రపంచ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నలపరాజు లింగయ్య జోనల్ అధ్యక్షులు బొమ్మిడి సత్తిరెడ్డి గౌరవాధ్యక్షులు గంగాపురం సత్యనారాయణ నిమ్మల యాదగిరి పసుల యాదయ్య ఉపాధ్యక్షులు మైలారం రాజు,ప్రధాన కార్యదర్శి కొంగరి ప్రసాద్, కోరే ప్రకాష్,గట్టు మల్లేష్ మండే మల్లేష్ లింగాల వెంకటేష్,పరమేష్ మైలారం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# నిన్న హొసబాలే నేడు ధన్కడ్,రాజ్యాంగ పీఠిక పై వివాదాన్ని రాజేస్తున్న ఆరెస్సెస్-బీజేపీ

ఢిల్లీ (జై భీమ్ న్యూస్)

రాజ్యాంగ ప్రవేశికలోని "లౌకిక", "సోషలిస్ట్" పదాలను సమీక్షించాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబాలే పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ ఆ పదాలపై అభ్యంతరం వ్యక్తం చేసి వాటిని "వేడి నోటిపొక్కులు" అని అభివర్ణించారు. అదే సమయంలో,రాజ్యాంగంలోని ఏదైనా పదాన్ని తాకడానికి ప్రయత్నిస్తే, పార్టీ చివరి శ్వాస వరకు దానిని వ్యతిరేకిస్తుందని కాంగ్రెస్ పేర్కొంది. రాజ్యాంగ ప్రవేశికలోని "లౌకిక", "సోషలిస్ట్" పదాలను సమీక్షించాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు.దీని తర్వాత ,ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ కూడా ఈ పదాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటిని "వేడి నోటిపొక్కులు"గా అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబాలే ప్రకటనను ప్రతిపక్షం తీవ్రంగా విమర్శించింది. అంతేకాకుండా ఆ సంస్థ పేదలకు, అణగారిన వర్గాలకు వ్యతిరేకమని ఆరోపించింది. జూన్ 28న ది ట్రిబ్యూన్‌తో ధన్కడ్ మాట్లాడుతూ, "రాజ్యాంగానికి చీకటి కాలమయిన అత్యవసర పరిస్థితిలో ఈ పదాలు చేర్చబడ్డాయి. ఈ పదాలను జోడించడం వల్ల మన ఉనికికే ముప్పు ఏర్పడింది. ఈ పదాలు "వేడి నోటిపొక్కులు" లాంటివి, అల్లకల్లోలం సృష్టిస్తాయి. వీటిని రాజ్యాంగ ప్రవేశికలో జోడించడం రాజ్యాంగ నిర్మాతలకు చేసిన ద్రోహం. ఇది మన నాగరికత వారసత్వానికి అవమానం, ఇది సనాతన ఆత్మను అపవిత్రం చేయడమే" అని అన్నారు. మరే ఇతర దేశం కూడా తన రాజ్యాంగంలోని ప్రవేశికలో ఇంత మార్పు చేయలేదని, ప్రవేశికను మార్చలేమని ధన్కడ్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం గొంతు కోసి చంపబడుతున్న సమయంలో ఈ పదాలు జోడించబడటం అత్యంత దురదృష్టకరమని ఆయన నొక్కి చెప్పారు. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే ప్రకటనకు కొన్ని రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి ఈ వ్యాఖ్యలు చేశారు. "రాజ్యాంగంలోని ఏ పదాన్ని అయినా ముట్టుకునే ప్రయత్నం జరిగితే, కాంగ్రెస్ చివరి శ్వాస వరకు పోరాడుతుంది" కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం(జూన్ 30) బెంగళూరులో పీటీఐతో మాట్లాడారు. రాజ్యాంగంలోని ఏదైనా పదాన్ని తాకడానికి ప్రయత్నిస్తే, తమ పార్టీ చివరి శ్వాస వరకు దానిని వ్యతిరేకిస్తుందని అన్నారు. "బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలని హొసబాలే కోరుకోవడం లేదు. వేల సంవత్సరాల క్రితం ఏమి జరిగిందో అది కొనసాగాలని ఆయన కోరుకుంటున్నారు. అందుకే ఆయనకు సోషలిజం, లౌకికవాదం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి సూత్రాలు నచ్చవు" అని ఖర్గే చెప్పారు. ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ పేదలు, అణగారిన వర్గాలు, షెడ్యూల్డ్ కులాలు, ఇతర వర్గాలకు వ్యతిరేకంగా ఉందని ఖర్గే ఆరోపించారు. "వారు నిజంగా హిందూ మత ప్రతినిధులమని చెప్పుకోవాలనుకుంటే, వారు మొదట దేశం నుంచి అంటరానితనాన్ని అంతం చేయాలి. కేవలం మాట్లాడటం, నానా యాగి చేయడం, గందరగోళం సృష్టించడం వల్ల ఏం సాధించలేము" అని ఆయన పేర్కొన్నారు. దేశంలో అంటరానితనాన్ని అంతం చేయడానికి ఆర్ఎస్ఎస్ తన స్వచ్ఛంద సేవకులను పంపాలని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు ఖర్గే పిలుపునిచ్చారు. "బదులుగా వారు కేవలం మాట్లాడతారు, దేశంలో గందరగోళాన్ని వ్యాపింపజేస్తారు. ఇది చాలా తప్పు, మేము దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము. రాజ్యాంగంలోని ఏ పదాన్ని మార్చే ఏ ప్రయత్నానికైనా కాంగ్రెస్ మౌనంగా చూస్తూ కూర్చోదు. పూర్తి శాయశక్తులతో దానికి వ్యతిరేకంగా పోరాడుతుంది" అని ఖర్గే అన్నారు.

# లంచం తీసుకుంటూ పట్టబడ్డ జిహెచ్ఎంసి ఉద్యోగి

**హైదరాబాద్,జులై 1(జై భీమ్ న్యూస్):**

లంచం తీసుకుంటుండగా జిహెచ్ఎంసి మూసాపేట్, సీనియర్ అసిస్టెంట్‌ను ఎసిబి అధికారులు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి అధికారుల కథనం ప్రకారం జిహెచ్ఎంసి, మూసాపేట్ సర్కిల్ 23లో, ఎం.సునీత సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. బాధితుడి తల్లి పేరుపై ఉన్న ఆస్తిని తన పేరుపై మార్చి మ్యూటేషన్ చేయాలని ప్రాపర్టీ ట్యాక్స్ విభాగంలో పనిచేస్తున్న సునీతను సంప్రదించాడు. ఈ పనిచేసేందుకు సునీత రూ. 80,000 లంచం డిమాండ్ చేసింది. పలుమార్లు కలిసి బతిమిలాడగా, చివరకు రూ. 30,000లకు చేస్తానని, అంతకంటే తక్కువకు చేయనని చెప్పింది. దీంతో విసిగిపోయిన బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు సునీతకు రూ. 30,000 ఇస్తుండగా ఎసిబి అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్టు చేసి నాంపల్లిలోని ఎసిబి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించింది. నిందితురాలిని ఎసిబి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# బీసీ అంటే అమితామైన ప్రేమ, నమ్మకం, విశ్వాసం ఉన్న వ్యక్తి రేవూరి ప్రకాశ్ రెడ్డి

**బిఆర్ఎస్‌కు. దళితులను అవమానిచడం శర మాములు అయింది**
**బిఆర్ఎస్‌కు అధికారం పోయిన దళితులపై అహం తగ్గలే**
**పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పతకాలు**
**స్థానిక సంస్థలలో బిఆర్ఎస్ కనుమరుగు**
**ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే శ్రామికుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

జూన్ 1న వరంగల్ నగరంలోని 16వ డివిజన్ పరిధిలోని కీర్తినగర్ లో నందు జూన్ 30న బిఆర్ఎస్ నేతలకు స్థానిక కార్పొరేటర్, బిఆర్ఎస్ నాయకులు చేసిన అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ 16వ డివిజన్ కీర్తి నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ హుజుర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో 16 డివిజన్ అధ్యక్షులు దుపాకి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఘాటుగా స్పందించారు వారు మాట్లాడుతూ గత బి.ఆర్.యస్ పాలనలో చేసిన కామిషన్లకు, అక్రమాలకు పాల్పడిన వారు ప్రజా ప్రభుత్వం పై స్థానిక ఎమ్మెల్యే పై దుష్ప్రచారం చేయడానికి మానుకోవాలని ప్రజలు మీ మాయ మాటలు నమ్మే పరిస్థితిలో లేరని, పది సంవత్సరాలు కాలయాపన చేసి ప్రజలను మోసం చేసిన మిమల్ని ఈ కీర్తి నగర్ ప్రజలు మర్చిపోయారు. మీ బీఆర్ఎస్ పాలనలో ప్రజల గోడు వినకుండా ఇష్ట రాజ్యాంగ వ్యవహరించి భూ కబ్జాలకు, అక్రమాలకు పాల్పడి ఇప్పుడు కమిషన్లు లేక మతిభ్రమించి ఎమ్మెల్యే గారి పై అసత్య ప్రచారాలు చేయడం సరైనది కాదు అని హేచ్చరించారు. ఏ ఆధారం లేక మహా నగర పాలక అధికారులపై తప్పుడు ప్రచారాలు చేస్తూ తిరగడం వారికి అలవాటైపోయింది. అభివృద్ధి గురించి బిఆర్ఎస్ నాయకులు మాట్లాడటం దయ్యాలు వేదాలు విల్లించినట్లు ఉంది అన్ని ఎద్దేవచేసారు. పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి తరచు మహానగర పాలక అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తు ఎప్పటికి, అప్పుడు పరకాల నియోజకవర్గం పరధిలోని మూడు డివిజన్ ల సమాచారం తెలుసుకుంటున్నారు. ప్రజల కోసం శ్రామిస్తున్నాడు అని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందిస్తున్న నాయకుడు రేవూరి ప్రకాష్ రెడ్డి అని అన్నారు. సుధీర్గ రాజకీయ అనుభవం ఉన్న నేత పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అని వారి రాజకీయ అనుభవం అంత వయస్సు లేని వ్యక్తులు ఎమ్మెల్యే పై తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదు అని ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని ఘాటుగా స్పందించారు. ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే శ్రామికుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అని అన్నారు. అయన కక్ష సంధించే వ్యక్తి కాదు కానీ వారు అలా చేస్తే మీరు చేసిన అక్రమాలకు, ఆగహిత్యలకు మీరు, మీ నాయకులు అంత జైలు జీవితం గడిపేవారు అని తెలిపారు. సొంత పార్టీ నేతల పై మాట్లాడం లేదు అని, విమర్శించడం లేదు అనే విషయానికి వస్తే రేవూరి ప్రకాశ్ రెడ్డి కాన్ఫరెన్స్ కాల్ ద్వారా బీసీ నాయకుల పై ఎక్కడ మాట్లాడకూడదు అని చెప్పారని బీసీలు ఆన్న బీసీ నాయకులు ఆన్న వారి అమితామైన ప్రేమ, నమ్మకం విశ్వాసం ఉన్న వ్యక్తి అందుకు నిలువెత్తు నిదర్శనం రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు అని తెలిపారు. అది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం, గొప్పతనం అని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మాత్రమే కాంగ్రెస్ పార్టీ నాయకులుగాని కార్యకర్తలుగాని పని చేస్తారు అని రెచ్చగొట్టే, చిచ్చులు పెట్టే నాయకులకు కాంగ్రెస్ పార్టీ లొంగదు అని వివరించారు. మీరు బీసీ నాయకులు అయివుండి మీ రాజకీయ స్వార్ధం కోసం ఓ బీసీ నాయకుని అవమానిచ్చమని చెప్పడం మాట్లాడటం మీలాంటి నీచమైన వ్యక్తుత్వం ఉన్న వారికి మాత్రమే సాధ్యంఅవుతుంది కానీ కాంగ్రెస్ పార్టీకి కాదు అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీలో దయ్యాలు ఉన్నాయి అని చెప్పిన ఎమ్మెల్సీ కవిత మాటలను గుర్తు చేసుకోవాలని, రానున్న రోజులలో బిఆర్ఎస్ తెలంగాణలో కనుమరుగయ్యే పోతుంది అని తాటి ఆకు చప్పులకు బెదిరేది లేదు అని తెలియజేసారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్ఎస్ కానరాకుండా పోవడం ఖాయం అని కాంగ్రెస్ పార్టీ లోనికి వస్తే రేవూరి ప్రకాశ్ ఆధ్వర్యంలో మంచి అవకాశాలు ఉంటాయని వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. మరీముఖ్యంగా బిఆర్ఎస్. నాయకులకు జాతి, కుల వివక్ష ఉందని మరోసారి రుజువుయింది అని అన్నారు, దళిత రత్నా అవార్డు గ్రహిత, బిఆర్ఎస్ 16వ డివిజన్ అధ్యక్షులు మేధోశక్తి కలిగిన వ్యక్తి పోగుల సంజీవని ఓ దళితుడనే ఉద్దేశంతో కావాలనే అవమానిచడం సరైనది కాదు అని అన్నారు. స్థానిక కార్పొరేటర్ భర్త మీడియాతో మాటడుతుండగా మీడియా మైక్ అతనికి పట్టుకోమానటం సరైనది కాదు అని బి.ఆర్. యస్. డివిజన్ అధ్యక్షులు సంజీవకి క్షేమాపన చెప్పాలని డిమాండ్ చేసారు. దళిత నాయకుడు సంజీవను రాజకీయంగా ఏదగానియ కుండా తరచు కులావివక్షతకు గురిచేయడం, అవమానిచడం బిఆర్ఎస్ నాయకులకు శర మాములుగా మారింది. గతంలో హన్మకొండలో చల్లా ధర్మా రెడ్డి, నేరాళ్ల లో కేటీఆర్ లు దళితులను అవమానిస్తే ప్రభుత్వలే కూలిపోయాయి అని గుర్తుచేశారు. ధర్మా రెడ్డి, కేటీఆర్ లకు ఏ గతి పట్టిందో, దళితులను అవమానిచ్చే ప్రతి నాయకుడికి ఆదే పరిస్థితి పడుతుంది అని హెచ్చారుంచారు. మీకు చిత్తశుద్ధి ఉంటే పంతలను, పట్టింపులను పక్కన పెట్టి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డితో కలసి డివిజన్ అభి వృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు కొండేటి కొమురెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లెం సుధాకర్, గరీబ్ నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసారపు సారన్న, జానపాక గ్రామ అధ్యక్షులు ఎండి జానీ, గొర్రెకుంట గ్రామ అధ్యక్షులు ల్యాదల్ల సంపత్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెక్క లక్ష్మీ రమేష్, అఫ్రీన్, అంకేశ్వరపు రాజు, పిట్టల అనిల్, మౌనిక, గ్రామ పార్టీ యూత్ అధ్యక్షులు అజీ ముద్దీన్,మచ్చర్ల శ్రీనివాస్, ఎండి అంజద్, మునుకుంట్ల ప్రభాకర్, వెంకట్ మధుసూదనా చారి, అవధూత శ్రీనివాస్, పరకాల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వల్లెం సాయ, ఏ రవీందర్, గొట్టి ముక్కుల పరిపూర్ణ చారి, శివరాత్రి చిన్న వెంకన్న, బిర్రు ప్రసాద్, గుర్రపు శ్యామ్, తక్కల్లపల్లి రాజశేఖర్, గొర్రె కరుణాకర్, సోషల్ మీడియా ఇంచార్జి ఉదయ్ కుమార్, క్రాంతి, భరద్వాజ్, ప్రణయ్ భాస్కర్, రాజు, సంజయ్, శివరాత్రి చిన్న వెంకన్న ఎస్కే హాలీం తదితరులు పాల్గొన్నారు.

# అత్తింటి వేధింపులే.. ఐఏఎస్‌ని చేశాయి!

**జై భీమ్ న్యూస్ (హైదరాబాద్)**

ఒక్క క్షణం గడిస్తే..ఆమె మెడకు ఉరిపడేదే! కానీ ఆ ఒక్క క్షణంలోనే తన జీవితం మలుపు తిరిగింది. అత్తింటి వేధింపులు తట్టుకోలేక చనిపోదామనుకున్న సవితా ప్రధాన్ ఇద్దరు పిల్లలతో ఒంటరి పోరాటం చేసింది. ఐఏఎస్ సాధించి.. 'హిమ్మత్‌వాలీ లడ్కియా' పేరుతో నేటితరం ఆడపిల్లల్లో ధైర్యాన్నీ, స్థైర్యాన్నీ నూరిపోస్తోందిలా..!

**తెలివైన ఐఏఎస్ అధికారిణిగా గుర్తింపు..**

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్, చంబల్‌కు అర్బన్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ హోదా. ఇది ప్రస్తుతం.. ఆకలికి తట్టుకోలేక లోదుస్తుల్లో రొట్టెలు దాచుకుని బాత్‌రూమ్‌లో గుట్టుగా తిన్న చేదు గతం మరోవైపు. మధ్యప్రదేశ్‌లోని మండీ గ్రామం మాది. ఆదివాసి కుటుంబం. అమ్మానాన్నలకు మేం ఏడుగురం. నేను మూడో సంతానం. బీడీ ఆకులు ఏరుతూ, కూలీ చేసుకుంటూ పొట్ట పోషించుకునేవాళ్లం. చదివించాలని లేకపోయినా నాకొచ్చే రూ.75 స్కాలర్‌షిప్ డబ్బులు, ఒక పూట జావ, జత యూనిఫాం కోసం పాఠశాలలో చేర్చారు. ఉద్దేశం ఏదైనా కష్టపడి చదివి పది పాసయ్యా. మా ఊళ్లో పది పూర్తి చేసిన మొదటి అమ్మాయినని చాలా సంతోషించా. ఇంతలోనే పెళ్లన్నారు. నాకన్నా పదకొండేళ్లు పెద్దవాడు. పెళ్లిచూపుల్లోనే అతని దురుసుతనం బయటపడింది. నాకీ పెళ్లివద్దని చెబితే.. పెద్దింటి సంబంధమని నోరు నొక్కేశారు. అత్తింట్లో పరిస్థితి మరీ దారుణం. వాళ్లకి కావాల్సింది కోడలు కాదు, పనమ్మాయి. అందరూ తిన్న తర్వాతే నేను తినాలి. ఒక వేళ ఏమీ మిగలకపోతే మళ్లీ వండకూడదు. నలుగురిలోకి రాకూడదు. తలమీద చెంగు తీయకూడదు. నవ్వకూడదు. టీవీ చూడకూడదు. ఎదురు తిరిగితే రక్తం కారేలా కొట్టేవాడు నా భర్త. నవ్వడం ఎప్పుడో మరిచిపోయా. ఆత్మహత్య చేసుకుందామనుకొనే సమయానికి.. గర్భవతిని అని తెలిసింది. అలాంటి సమయంలో కూడా సరిగా తిండి పెట్టేవారు కాదు. దాంతో ఆకలికి తట్టుకోలేక నాలుగు రొట్టెలు దొంగిలించి లోదుస్తుల్లో దాచుకుని రహస్యంగా స్నానాలగదిలో తినేదాన్ని. ఇవన్నీ అమ్మకు చెబితే ఒక బిడ్డపుడితే అంతా సర్దుకుంటుందిలే అంది. ఇద్దరు పుట్టారు. యజుష్, అథర్వ్. పరిస్థితిలో ఏ మార్పూ రాలేదు.

**ఆఖరి క్షణంలో...**

ఈ కష్టాలతో విసిగిపోయి ఉరిపోసుకోవడానికి సిద్ధమయ్యా. చీర ఫ్యాన్‌కి బిగించా. మెడకు చుట్టుకునేటప్పుడు అనుకోకుండా నా చూపు కిటికీ వైపు పడింది. అక్కడ మా అత్తగారు నేను చేసేదంతా కన్నార్పకుండా చూస్తుందే తప్ప ఆపలేదు. కనీసం ఎందుకిలా చేస్తున్నావ్ అని అడిగే ప్రయత్నం కూడా చేయలేదు. 'ఛీ ఇలాంటి వాళ్ల కోసమా నేను చావాలనుకుంటుంది. అయినా నేను పోయాక పిల్లల పరిస్థితి ఏంటి?' అన్న ఆలోచన వచ్చింది. పిల్లల కోసమైనా బతకాలి. బయటకెళ్లి.. పాచిపని చేసుకునైనా నా బిడ్డల్ని సాకుతా తప్ప ఇక అక్కడ ఒక క్షణం కూడా ఉండకూడదని నిశ్చయించుకున్నా.

**నాలుగంకెల జీతం...**

రెండువేల రూపాయలతో ఇంట్లోంచి బయటకు వచ్చాను. ఓ బ్యూటీపార్లర్‌లో సహాయకురాలిగా చేరా. చిన్నపిల్లలకు ట్యూషన్లు చెప్పడం, ఇంట్లో వంటపనులు చేయడం.. ఇలా దొరికిన పనల్లా చేశా. ఇవన్నీ చేస్తూనే బీఏ పరీక్షలు రాశా. ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చేశా. యూనివర్సిటీ ఫస్ట్. కొన్ని రోజులకి అమ్మ సాయం కూడా తోడైంది. చిన్న ఉద్యోగం వస్తే చాలనుకుని దినపత్రికలు తిరగేస్తోంటే.. యూపీఎస్సీ నోటిఫికేషన్ కనిపించింది. అందులో నాకు మొదట కనిపించింది.. మంచి జీతమే. ఎంతకష్టమైనా సాధించాలని గట్టిగా అనుకున్నా. రేయింబవళ్లు చదివి మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించా. 24 ఏళ్లకే చీఫ్ మున్సిపల్ ఆఫీసర్‌నయ్యా.

**నా జీవితమే పాఠంగా...**

ఇల్లొదిలి వచ్చినా.. నా కాళ్లపై నేను నిలబడినా నా భర్త వేధింపులు తగ్గలేదు. ఎక్కడుంటే అక్కడకు వచ్చి కొట్టేవాడు. ఆఖరికి పోలీసులకు ఫిర్యాదు చేసి అతన్నుంచి విడాకులు తీసుకున్నా. నాకు నచ్చిన హర్షని రెండో వివాహం చేసుకున్నా. నాలా మౌనంగా బాధలు భరించే ఆడపిల్లల కోసం హిమ్మత్ వాలీ లడ్కియా (బ్రేవ్ గర్ల్స్)పేరుతో యూట్యూబ్ ఛానల్‌ను మొదలుపెట్టా. నా జీవితాన్నే వాళ్లకి పాఠాలుగా చెబుతూ.. అమ్మాయిలకు ధైర్యం, తెగువ నూరి పోస్తున్నా.!

# హర్యానాలో పలు ప్రాంతాలు జలమయం

**షుగర్ ఫ్యాక్టరీలో కొట్టుకు పోయిన కోట్ల విలువ చక్కెర**

**చండీఘడ్,జులై 1(జై భీమ్ న్యూస్) :**



రాత్రికి రాత్రే భారీగా కురిసిన వానలతో హర్యానాలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. యమునానగర్ లోని సరస్వతి సుగర్ మిల్ ప్రాంగణం లోకి నీరు చేరింది. దాంతో ఆసియాలో అతిపెద్ద షుగర్ మిల్‌గా పేరు గాంచిన దానిలో కోట్ల రూపాయల విలువ చేసే పంచదార కరిగిపోయింది. యమునానగర్ ప్రాంతం లోని గిడ్డంగిలో 2.20 లక్షల క్వింటాళ్ల పంచదారను నిల్వ చేశారు. దాని మొత్తం విలువ రూ.97 కోట్లు. అయితే వర్షాల కారణంగా పక్కనున్న కాలువ పొంగి నీరు మిల్లులోకి చేరిందని సరస్వతి షుగర్ మిల్ జనరల్ మేనేజర్ రాజీవ్ మిశ్రా వెల్లడించారు. రాత్రి భారీ వర్షంతో మిల్లు ప్రాంగణం లోకి నీరు వస్తోందని అర్ధరాత్రి సమయంలోతమ సిబ్బంది అప్రమత్తం చేశారని, మిల్లు పక్కనున్న కాలువ ఆక్రమణకు గురికావడంతో దానిలో నీరు ఒక్కసారిగా పొంగిందని చెప్పారు. ఆ నీరు మిల్లు లోకి చేరడంతో క్వింటాళ్ల కొద్దీ పంచదార తడిసిపోయిందన్నారు. దాని విలువ రూ50 నుంచి 60 కోట్ల వరకు ఉంటుందని , ఒకసారి గిడ్డంగి మొత్తాన్ని పరిశీలించి పూర్తి నష్టాన్ని వెల్లడిస్తామని తెలిపారు. మిల్లులోకి ఇలా వరద నీరు రావడం ఇదే తొలిసారని, రూ. కోట్లలో నష్టం వచ్చినా, స్థానిక మార్కెట్లలో పంచదార లభ్యతపై ప్రభావం ఉండదని మిశ్రా వెల్లడించారు. మిల్లు లోని నీటిని తొలగించడానికి అధికారులు క్రేన్‌ను వినియోగిస్తున్నారు.

# బనకచర్లపై బిఆర్ఎస్‌ది అలుపెరగని పోరాటం

**ప్రభుత్వం మొద్దు నిద్ర వీడేలా చేసాం: హరీష్ రావు**

**హైదరాబాద్,జులై 1(జై భీమ్ న్యూస్):**

ఎపి నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో కాంగ్రెస్‌ను మొద్దు నిద్ర లేపింది బిఆర్ఎస్ పార్టీ అని మాజీ మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు తిరస్కరించే వరకు అలుపెరుగని పోరాటం చేసింది బిఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. గోదావరిలో 1000 టిఎంసిలు, కృష్ణాలో 500 టిఎంసిలు చాలు అని చెప్పిన రేవంత్‌కు.. మిగులు జలాల్లోనూ తెలంగాణకు వాటా ఉంటుందని జ్ఞానోదయం చేసింది బిఆర్ఎస్ పార్టీ అని పేర్కొన్నారు. అవే పాత అబద్దాలు ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి.. అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఇప్పటికీ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు పట్ల రేవంత్‌రెడ్డి చూపుతున్న గురు భక్తికి ఇది నిదర్శనం కాదా..? అని నిలదీశారు. జిడబ్లూడిటి అవార్డు ప్రకారం, సిడబ్లూసి అనుమతి పొందకుండా ఈఏసీ అనుమతి ఇవ్వదు అని తెలిపారు. ఎపి అనుమతుల కోసం సిడబ్లూసికి వెళ్లే కంటే ముందే అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లాలనే సోయి కూడా లేదు రేవంత్‌రెడ్డికి లేదని విమర్శించారు. కనీస అవగాహన లేని వ్యక్తులు నీటి పారుదల శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యం అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తొమ్మిదిన్నరేండ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రస్తావనే రాని బనకచర్ల ప్రాజెక్టు, ఇప్పుడు ఎవరి అండ చూసుకొని ముందుకు వచ్చిందో తెలంగాణ ప్రజలకు తెలియదా..? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మౌనంగా ఉంటూ అందిస్తున్న సహకారం వల్లనే కదా బనకచర్ల వ్యవహారం ఇక్కడి దాకా వచ్చింది అని నిలదీశారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో అన్యాయం చేస్తూనే, లెక్కకు మించి అబద్దాలు ప్రచారం చేస్తూ.. బిఆర్ఎస్‌పై చేస్తున్న రేవంత్‌రెడ్డి క్షుద్ర రాజకీయాన్ని తెలంగాణ సమాజం గమనిస్తున్నదని, ఆయన తెలంగాణ వ్యతిరేక విధానాలను అసహ్యించుకుంటున్నదని పేర్కొన్నారు.

## మేడ్చెల్ కంపెనీలో పేలుడు: ఒకరిగి గాయాలు

మేడ్చెల్,జులై 1(జై భీమ్ న్యూస్): పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఫార్మా కంపెనీలో సోమవారం భారీ పేలుగు ఘటన తరహాలోనే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మంగళవారం ప్రమాదం చోటుచేసుకుంది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కంపెనీ పేలుడు సంభవించింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పారిశ్రామికవాడలోని ఆల్కలాయిడ్ కంపెనీలో బాయిలర్ పేలి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. షాపూర్‌కు చెందిన మూల శ్రీనివాస్ రెడ్డి గత 12 సంవత్సరాలుగా కంపెనీలో పనిచేస్తునాడు. ఉదయం కంపెనీలో బాయిలర్ ఒకసారిగా పేలడంతో అతను కుప్పకూలిపోయాడు. దీంతో కంపెనీ లోని తోటి కార్మికులు అతనిని స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అయితే, ఈ విషయం బయటకి రాకుండా కంపెనీ యాజమాన్యం గోప్యంగా ఉంచింది.

# ఇందిరమ్మ రాజ్యంతో మళ్లీ పాతరోజులు

**యూరియా కోసం రైతుల పడిగాపులు: కెటిఆర్**

**హైదరాబాద్,జులై 1(జై భీమ్ న్యూస్) :**

ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. ఆనాటి రోజులు తిరిగి తెచ్చిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు.యూరియా కోసం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలంలో రైతులు, మహిళలు బారులు తీరారని పేర్కొన్నారు. ఈ మేరకు యూరియా కోసం వందలాది మంది రైతులు ఇబ్బంది పడుతున్న వీడియోను కెటిఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇళ్లు కూల్చొద్దని, హైకోర్టు స్టే ఆర్డర్ ఉందని నిరుపేదలు నెత్తి నోరు మొత్తుకున్నా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం చూపకపోవడం అత్యంత దుర్మార్గం అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి కొడంగల్లో రెడ్డికుంటని పూడ్చి మహల్ కట్టవచ్చు, ఆయన అన్న తిరుపతి రెడ్డికి దుర్గం చెరువు ఎఫ్‌టిఎల్‌లో ఇల్లు ఉండవచ్చు, రెవిన్యూ మంత్రి హిమాయత్ సాగర్‌లో ప్యాలసులు కట్టవచ్చు, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి చెరువు నడుమ గెస్ట్ హౌస్ కట్టవచ్చు, కేవీపీ లాంటి పెద్దలు చెరువు బఫర్‌లో గెస్ట్ హౌసులు కట్టుకోవచ్చు?పెద్ద బిల్డర్లు సిఎంకు లంచం ఇచ్చి మూసి నదిలోనే అపార్ట్‌మెంట్స్ కట్టుకోవచ్చు, కానీ సిఎం రేవంత్‌రెడ్డికి, హైడ్రాకు ఇవేవి కనబడవు అని మండిపడ్డారు. బుల్డోడర్‌రాజ్, కాంగ్రెస్ ఫెయిల్డ్ తెలంగాణ హ్యాష్ ట్యాగ్‌తో కెటిఆర్ ట్వీట్ చేశారు.

# ఖైదీల వివరాలు పంచుకున్న భారత్, పాక్

**న్యూఢిల్లీ,జులై 1(జై భీమ్ న్యూస్) :**

భారత్, పాకిస్థాన్‌లు తమ కస్టడీలో ఉన్న పౌర ఖైదీలు, మత్సకారుల వివరాల జాబితాలను మంగళవారం పరస్పరం మార్పిడి చేసుకున్నాయి. వీటి ప్రకారం ప్రస్తుతం పాక్ చెరలో భారతీయులు, భారతీయులుగా పరిగణిస్తున్న 246 మంది పేర్లను వెల్లడించింది. వారిలో 53 మంది పౌర ఖైదీలు, 193 మంది మత్సకారులు ఉన్నారు. ఇస్లామాబాద్ లోని భారత హైకమిషన్‌కు పాక్ ప్రభుత్వం ఈ వివరాలు అందించిందని విదేశాంగ శాఖ వెల్లడించింది. వారిని త్వరగా విడుదల చేసి స్వదేశానికి పంపించాలని భారత ప్రభుత్వం ఈ సందర్భంగా పాక్‌ను కోరింది. అదే సమయంలో భారత్ కూడా తమ జైళ్లలో ఉన్న పాక్ ఖైదీల వివరాలున్న జాబితాను ఢిల్లీ లోని పాక్ హైకమిషన్‌కు అందించింది. మన అదుపులో పాక్ జాతీయులు, పాక్‌జాతీయులుగా పరిగణిస్తోన్న వారు 463 మంది ఉన్నారు. అందులో 382 మంది పౌర ఖైదీలు కాగా, 81 మంది జాలర్లు. 2008లో చేసుకున్న ఒప్పందం ప్రకారం? ఇరు దేశాలు ఏటా రెండుసార్లు జనవరి 1, జులై 1 దౌత్యమార్గాల ద్వారా ఈ వివరాలను పరస్పరం పంచుకుంటాయి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# రానా దగ్గుబాటి మరో కొత్త తరహా చిత్రం

**గ్రామీణ నేపథ్యంలో కొత్తపల్లిలో ఒకప్పుడు**

ప్రస్తుతం వైవిధ్యమైన కథలతో ప్రయోగాలు చేస్తున్న రానా దగ్గుబాటి మరో కొత్త తరహా చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఈ సినిమా పేరే ఆసక్తికరంగా 'కొత్తపల్లిలో ఒకప్పుడు' అని పెట్టారు. గ్రామీణ నేపథ్యం తో సాగే ఈ భావోద్వేగ కథ వెనక సున్నితమైన సామాజిక సందేశం కూడా ఉంది. ఈ చిత్రానికి ప్రవీణ పరుచూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఇదివరకే 'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' వంటి చిన్న సినిమాలతో పెద్ద సెన్సిబుల్ హిట్స్ అందించిన ప్రవీణ, ఈసారి మరింత లోతైన కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కథలో గ్రామీణ యువకుడు తన జీవితంలో ఎదురైన ఓ అనూహ్య సంఘటన, తరువాత ఎదుర్కొన్న ప్రయాణాన్ని చూపించ నుంది. మారుతున్న సమాజంలో గ్రామీణ సంస్కృతి, విలువలు, సంబంధాలు ఎలా మాయమవుతున్నాయనే విషయాన్ని ఈ చిత్రం లోతుగా చూపనుంది. కాగా ఈ మూవీలో రానా, పూర్తి గ్రామీణ గెటప్‌లో కనిపించనున్నాడు. ఇప్పటి వరకు చూడని ఓ మెలోడ్రామా టిక్, ఎమోషనల్ కోణంలో రానా నటనను ఈ సినిమాలో చూడబోతున్నాం. మేకర్స్ చెబుతున్న దానివల్ల ఇది రానా కెరీర్‌లో కొత్త మలుపు కావొచ్చని అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాకు లాస్ ఏంజిల్స్‌కి చెందిన అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ విజువల్స్ అందిస్తుండగా, ఈ 'కొత్తపల్లిలో ఒకప్పుడు' త్వరలోనే థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే టైటిల్ పాయింట్, కాన్సెప్ట్ విషయంలో మంచి బజ్ క్రియేట్ అవ్వగా. ఇప్పుడు చూడాల్సిందల్లా ఈ కొత్త ప్రయోగం రానాకు హిట్ అందిస్తుందా లేదా అన్నది.



# ఇండియన్ సినిమాను ఉన్నతంగా నిలిపే యత్నం




**ప్రత్యేకంగా సిద్ధం అవుతున్న వార్-2**

ఇండియన్ సినిమాను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు యష్ రాజ్ ఫిలిమ్స్, బాలీవుడ్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ సిద్ధమవుతున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ , గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ల కలయికలో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవెయిటెడ్ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వార్ 2' ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పరచుకుంది. ఇప్పుడు తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. వార్ 2లో యాక్షన్ ఒక్కటే కాదు? ఎనర్జీ పరంగా దుమ్ములేపే డాన్స్ నెంబరు కూడా ఉండబోతోంది. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో అత్యుత్తమ డ్యాన్సర్లు అని పేరొందిన ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ఇద్దరు కలిసి ఒకే స్క్రీన్‌పై స్టెప్పులేస్తే, అది రొటీన్ సాంగ్ మాదిరిగా కాకుండా డైనమిక్ మ్యూజికల్ ట్రీట్‌గా ఉంటుందని అంటున్నారు. ఇటీవల యష్ రాజ్ స్టూడియోస్‌లో ఈ సాంగ్ కోసం ఇద్దరు హీరోలు రిహార్సల్స్ చేయగా,ఈ రోజు నుంచే షూటింగ్ ప్రారంభమైంది. ఈ డాన్స్ నంబర్‌కి టాప్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. షూటింగ్ పలు రోజులు కొనసాగనుండగా, ఇందులో హైవోల్టేజ్ ఎనర్జీ, ఇంటెన్స్ స్టెప్స్ ఉండనున్నాయన్న టాక్ ఫిలింనగరంలో హీట్ పెంచుతోంది. వార్ 2ను కేవలం యాక్షన్ థ్రిల్లర్‌గా కాకుండా, అన్ని విభాగాల్లోనూ స్టాండర్డ్స్‌ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్టీఆర్ ? హృతిక్ మధ్య ÷ట్స్ అన్నీ ఏకంగా హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కుతుండగా, ఇప్పుడు డ్యాన్స్ ఎలిమెంట్ ఈ సినిమాను మరో లెవెల్‌కి తీసుకెళ్లనుంది. ఇద్దరికి సింగిల్ టేక్ డ్యాన్సర్లు అనే పేరుంది. ఎన్టీఆర్ తన బ్లాస్టింగ్ డ్యాన్స్ మూవ్‌లతో తెలుగులో తిరుగులేని డ్యాన్సర్‌గా గుర్తింపు పొందగా, హృతిక్ రోషన్ బాలీవుడ్‌లో తన స్టైలిష్ స్టెప్స్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. అలాంటి స్టార్లను ఒకే పాటలో చూడడం అంటే, అభిమానులకే కాదు , ప్రేక్షకులందరికీ అది జీవితాంతం మరిచిపోలేని విజువల్ ఎక్స్‌పీరియన్స్ అవుతుంది. డ్యాన్స్ సీక్వెన్స్‌తో పాటు పవర్‌ప్యాక్డ్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్న ఈ చిత్రం భారీ అంచనాలతో తెరకెక్కుతోంది. ఎన్టీఆర్ 'దేవర', హృతిక్ '÷టైర్' తర్వాత వీరిద్దరు కలిసి వార్ 2 చిత్రం చేస్తున్నారు. ఆగస్ట్‌లో విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# ట్రైలర్స్‌తో దూసుకుపోతున్న తమ్ముడు

టాలీవుడ్‌స్టార్ హీరో నితిన్ 'తమ్ముడు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. చివరిగా రాబిన్ హుడ్‌తో ప్రేక్షకులని పలకరించగా, ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దీంతో ఇప్పుడు దర్శకుడు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా తమ్ముడు సినిమా చేశారు. ఇది జూలై 4న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ స్పీడ్ పెంచారు. ఇంటర్వ్యూలు, ప్రీ రిలీజ్ ఈవెంట్స్ ఇలా సినిమాపై ఆసక్తిని కలిగించే ప్రయత్న చేశారు. మరో రెండు రోజులలో తమ్ముడు చిత్రం విడుదల కానుండగా, చిత్ర బృందం రిలీజ్ ట్రైలర్ కొద్ది సేపటి క్రితం విడుదల చేసింది. నేను పుట్టినప్పుడే మా అమ్మ చనిపోయింది.. అనే డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది.నాకు అమ్మ అయిన నాన్న అయిన అన్నీ మా అక్కే అనే డైలాగ్ ఈ మూవీ సిస్టర్ సెంటిమెంట్‌తో రూపొందుతుంది అని తెలియజేస్తుంది. ట్రైలర్ ఎమోషన్స్, యాక్షన్ తో నిండిపోయింది. మూవీపై భారీ అంచనాలే పెంచింది. ఈ చిత్రం నితిన్‌కి తప్పక మంచి హిట్ ఇస్తుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇందులో సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ, స్వాశిక కథానాయికలుగా నటిస్తున్నారు. చిత్రంలో నితిన్ కి అక్కగా ఒకప్పటి హీరోయిన్ లయ నటిస్తుండగా, ఈ చిత్రంతోనే రీ ఎంట్రీ ఇస్తుంది. మూవీకి సంబంధించిన విడుదలైన టీజర్, పాటలు, ట్రైలర్ లకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు ఈ ట్రైలర్ కూడా ఆకట్టుకుంది. అయితే పవన్‌కు వీరాభిమాని అయిన నితిన్ ఇదే టైటిల్‌తో సినిమా చేశారు. సినిమా టైటిల్ ఒక్కటే అయినప్పటికీ స్టోరీలు మాత్రమ వేర్వేరుగా ఉండనున్నాయి. అయితే ఈ సినిమా టైటిల్ వాడడం పట్ల తాను సంతోషంగా లేనని నితిన్ రీసెంట్‌గా పాల్గొన్న ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ కథకు ఆ టైటిల్ మాత్రమే న్యాయం చేస్తుందని ప్రొడ్యూసర్ దిల్ రాజు, డైరెక్టర్ వేణు శ్రీరామ్ భావించి పట్టుబట్టి మరీ తనను ఒప్పించినట్టు నితిన్ చెప్పుకొచ్చారు.



# పవన్ షూటింగ్ స్పాట్‌లోకి చిరు ప్రత్యక్షం

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక వైపు సినిమాలు, మరోవైపు రాజకీయాలతో బిజీ బిజీగా గడుపు తున్నారు. ప్రస్తుతం పవన్ చేస్తున్న ఈ సినిమాలు ఎప్పుడో విడుదల కావాలి. కాని ఆయన రాజకీయ పనుల వలన డిలే అవుతూ వచ్చాయి. ఇప్పటికే హరి హర వీరమల్లు చిత్ర షూటింగ్ పూర్తి చేయగా,ఈ మూవీని జూలై 24న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇక పవన్ నటిస్తున్న మరో చిత్రం ఓజీ షూటింగ్ కూడా పూర్తైందని తెలుస్తుంది. సుజీత్ దర్శకత్వంలో యాక్షన్ డ్రామాగా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. సెప్టెంబర్‌లో మూవీ రిలీజ్‌కి ప్లాన్ చేశారు. ఇక పవన్ ఖాతాలో ఉన్న మరో చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నట్టు సమాచారం. పలు కీలక సన్నివేశాలను పవన్ కళ్యాణ్‌తో తెరకెక్కిస్తున్నాడు హరీశ్ శంకర్. అయితే ఈ మూవీ సెట్‌కి మెగాస్టార్ చిరంజీవి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. సోమవారం రోజు ఉస్తాద్ భగత్ సింగ్ సెట్‌లో అడుగుపెట్టిన చిరంజీవి చిత్రీకరణను దగ్గరుండి వీక్షించారు. దీనికి సంబంధించిన ఓ ఫొటో బయటకు వచ్చింది. ఇందులో చిరు షూటింగ్ సీన్?ను చూస్తుండగా, పవన్ కళ్యాణ్ పక్కనే ఉండడం మనం చూడవచ్చు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా బ్రదర్స్ ఇద్దరు చాలా రోజుల తర్వాత కలిసి కనిపించడంతో ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేవు. ఇక ఈ చిత్రంలో రియల్ లైఫ్ సీన్‌ని హరీష్ ఎ÷-లాన్ చేసినట్టు సమాచారం. పవన్ కళ్యాణ్? ఆ మధ్య ఓ సందర్భంలో కారు రూఫ్?పై కూర్చొని ప్రయాణించడం మనం చూశాం. ఆయన కారు టాప్?పై కూర్చొని వెళు తుండగా, కారుకు ఇరువైపులా సెక్యూరిటీ, వెనకాల బైకులపై అభిమానులు వెళ్లారు. ఈ వీడియో అప్పట్లో సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. ఇప్పుడు ఈ సీన్‌ని రీ క్రియేట్ చేసి సినిమాలో పెట్టనున్నాడట హరీష్ శంకర్. ఒకవేళ ఈ సీన్ సినిమాలో ఉంటే, థియేటర్లలో ఫుల్ విజిల్స్ పడడం పక్కా అని చెప్పాలి. ఇక ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన యువ నటి శ్రీలీల సందడి చేయనుంది. ఈ సినిమాకు దర్శకుడు దశరథ్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. సాక్షి వైద్య, అశుతోష్ రానా, గౌతమి, నాగ మహేష్, టెంపర్ వంశీ, కేజీఎఫ్ ఫేమ్ అవినాష్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నారు.

# ది హంట్: ది రాజీవ్ గాంధీ అస్సాసినేషన్ కేస్'





**రాజీవ్ హత్య ఆధారంగా మూవీ**

మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ హత్య ఆధారంగా 'ది హంట్: ది రాజీవ్ గాంధీ అస్సాసినేషన్ కేస్'ను జాతీయ అవార్డు గ్రహీత నాగేష్ కుకునూర్ తెరకెక్కించారు. అనిరుధ్య మిత్ర బెస్ట్ సెల్లింగ్ పుస్తకం 'నైన్టీ డేస్' నుంచి ఈ సిరీస్‌ను నగేష్ కుకునూర్ రూపొందించారు. ఆ కేసుని ఛేదించే క్రమంలో ÷ూఎ÷ుకి నాయకత్వం వహించిన వారు ఆ.ఖీ. కార్తికేయన్. ఆయన పాత్రను అమిత్ సియాల్ పోషిస్తున్నారు. ఈ మేరకు అమిత్ సియాల్ మాట్లాడుతూ..'ఒక నటుడికి ఇలాంటి ఓ గొప్ప పాత్రను పోషించే అవకాశం రావడం అదృష్టం.కార్తీకేయన్ లాంటి గౌరవప్రదమైన, దృఢ నిశ్చయం ఉన్న వ్యక్తిని పాత్రను బాధ్యతతో పోషించాల్సి ఉంటుంది. ఇది కేవలం రాజకీయ థ్రిల్లర్ కాదు. కార్తికేయన్ పేలుడు జరిగిన ప్రదేశాన్ని సందర్శించే క్షణం ఉంటుంది. అక్కడ శరీరం అయితే కనిపించ లేదు. ఎండిన రక్తానికి సంబంధించిన పెద్ద గుర్తు మాత్రమే ఉంటుంది. ఒకరిని కోల్పోవడం.. అసలు వీడ్కోలు చెప్పే వీలు కూడా లేని ఘటన ఎంతగానో కదిలిస్తుంటుంది. ఈ సిరీస్‌లో ఎస్పీ అమిత్ వర్మగా సాహిల్ వైద్, డిఎస్పీ రగోత్తమన్‌గా భగవతి పెరుమాళ్, డిఐజి అమోద్ కాంత్‌గా డానిష్ ఇక్బాల్, డిఐజి రాధావినోద్ రాజుగా గిరీష్ శర్మ, మరియు ఎన్ఎస్జి కెప్టెన్ రవీంద్రన్‌గా విద్యుత్ గార్గ్. ఈ సిరీస్‌లో షఫీక్ ముస్తఫా, అంజనా బాలాజీ, బి. సాయి దినేష్, శ్రుతి జయన్, గౌరీ మీనన్ కూడా కీలక పాత్రల్లో నటించారు. 'ది హంట్: ది రాజీవ్ గాంధీ అస్సాసినేషన్ కేస్' సిరీస్ జూలై 4న సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది.